
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 3
మంగళవారం 27 మే 2025



ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం

- మూడు రోజుల పాటు విస్తారంగా వానలు
- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం



నంద్యాల ఎడ్యుకేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు 16 సంవత్సరాల తర్వాత 8 రోజులు ముందుగానే కేరళ తీరాన్ని తాకిన తర్వాత తూర్పు, వాయివ్యదిశగా కదులుతూ సోమవారం రాయలసీమలోకి ప్రవేశించాయి. దీంతో కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల్లో పలు మండలాల్లో సోమవారం మోస్తరు వర్షాలు పడ్డాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులతో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. సోమవారం కర్నూలు జిల్లాలో 24.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, నంద్యాల జిల్లాలో 26.6డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

మూడు రోజుల పాటు...

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని, అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. మంగళవారం ఉరుములు, మెరుపులతో పాటు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని, నంద్యాల జిల్లాలో 15.6ఎంఎం నుంచి 64.4 ఎంఎం వరకు మోస్తరు వర్షం నుంచి భారీ వర్షం పడే సూచనలున్నాయని, కర్నూలు జిల్లాలో 2.5 ఎంఎం నుంచి 15.5 ఎంఎం వరకు సాధారణ వర్షపాతం నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని వెల్లడించారు. 28న నంద్యాల, కర్నూలు జిల్లాలో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంగా గాలులు వీచే అవకాశముందని, రెండు జిల్లాలో 15.6 ఎంఎం నుంచి 64.4 ఎంఎం వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని హెచ్చరించారు. 29వ తేదీ ఉరుములు మెరుపులతోపాటు 50 నుంచి 60కిలోమీటర్ల వేగంగా గాలులు వీచే అవకాశముందని, ఉమ్మడి జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే సూచనలున్నాయని వాతావరణ సంస్థ తమ నివేదికలో వెల్లడించింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ సూచనల ప్రకారం నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన నేపథ్యంలో నాలుగు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల శాఖల అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తెలియజేస్తూ నష్టం కలగకుండా చూడాలన్నారు. హోర్డింగులు, చెట్ల కింద శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాల వద్ద నిలిచి ఉండరాదని సూచించారు. అలాగే నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న చోట వాగులు, వంకలు, నదులు దాటరాదన్నారు.

నంద్యాల జిల్లాలో నమోదైన వర్షపాతం

శ్రీశైలం మండలంలో 35.2, పగిడ్యాల 19.2, వెలుగోడు 19.2, నందికొట్కూరు 18.2, మిడ్తూరు 14.6, జూపాడుబంగ్లా 13.8, గడివేముల 12.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. అలాగే కొత్తపల్లె 10.6, బండిఆత్మకూరు 7.8, ఆత్మకూరు 7.6, పాములపాడు 6.8, ఆళ్లగడ్డ 6.8, రుద్రవరం 3.2, గోస్పాడు 3.2, పాణ్యం 2.6, చాగలమర్రి 2.6, డోన్ 1.2ఎంఎం వర్షపాతం నమోదైంది.

కర్నూలు జిల్లాలో వర్షపాతం

గోనెగుండ్ల 13.8, నందవరం 11.6, ఆస్పరి 11.2, ఆలూరు 11.2, హోళగుంద 7.2, సి.బెళగల్ 6.0, గూడూరు 5.0, కర్నూలు 4.6ఎంఎం వర్షపాతం నమోదైంది.



వానలే.. వానలు



- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ
- పూర్తిగా చల్లబడిన వాతావరణం
- జిల్లాలో ఖరీఫ్ సాగు లక్ష్యం 3.57 లక్షల హెక్టార్లు

ఖరీఫ్‌కు జూన్ రెండో వారంలో ప్రవేశించాల్సిన నైరుతి రుతుపవనాలు బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఏర్పడిన అల్పపీడనాల కారణంగా శనివారమే కేరళను రుతుపవనాలు తాకాయి. రెండు రోజుల తర్వాత ఉమ్మడి కర్నూలు జిల్లాలో నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తే మరింత ముందుగానే ఆదివారం నుంచి మొదలయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శక్తి తుఫాన్ ఏర్పడిందని, దీని వల్ల ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వారం రోజుల పాటు వర్షాలు భారీగా కురుస్తాయనీ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో జోరువానలు ఆదివారంతో ప్రారంభమయ్యాయి. సోమవారం కూడా ఉదయం నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

కర్నూలు అగ్రికల్చర్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఖరీఫ్‌లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో రైతులు ప్రస్తుత వర్షాలకు పొలాలను దున్ని దుక్కి చేసుకోవడంతో పాటు విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. కర్నూలు నగరంలోని కొత్తబస్టాండు ప్రాంతంలో ఎరువులు, విత్తనాల కోసం ఫర్టిలైజర్స్ దుకాణాల ఎదుట రైతులు క్యూ కట్టారు. ముందస్తు వర్షాలతో మే నెలాఖరులోనే విత్తనాలు విత్తుకునే అవకాశం ఏర్పడటంతో రైతులు ముందున్నారు. ముందస్తు పంటల సాగు వల్ల క్రిమికీటకాల బెడద ఉండదని, తక్కువ సమయంలోనే పంట ఉత్పత్తులు చేతికి వస్తాయని రైతులు ఆశపడుతున్నారు. నైరుతి రుతుపవనాలు మే నెలలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రవేశించడం పదహారు ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి కావడం విశేషం.



ఆరున్నర లక్షల ఎకరాల్లో పంటల సాగు

జూన్ నుంచి మొదలయ్యే ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణంపై వ్యవసాయ శాఖ యంత్రాంగం అంచనా వేసింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు ఆరున్నర లక్షల ఎకరాల్లో పంటలు సాగుతవున్నాయనీ కర్నూలు జిల్లా జేడీ వరలక్ష్మి, నంద్యాల జేడీ మురళీకృష్ణ అంచనా వేసి అవసరమయ్యే విత్తనాలు, ఎరువుల కోసం వ్యవసాయ శాఖ కమిషనర్‌కు నివేదికను పంపారు. ముఖ్యంగా పత్తి సాగు ఈసారి గత ఏడాది కంటే 20 శాతం ఎక్కువగా ఉంటుందని కమిషనర్‌కు పంపిన నివేదికలో పేర్కొన్నారు. దాదాపు ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు 2.60 లక్షల హెక్టార్లలో ఉంటుందని, రాష్ట్రంలో ఈ విస్తీర్ణంలో పత్తి కర్నూలు మొదటి స్థానం పొందే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 4వ పేజీలో



పసుపు పండుగ..!

- కడప గడ్డపై నేటినుంచి 'మహా'సంబరం
- ఉమ్మడి కర్నూలు నుంచి వేలాదిగా తరలిన టీడీపీ శ్రేణులు

కర్నూలు, మే 26 (ఆంధ్రజ్యోతి): మహానాడు.. తెలుగుతమ్ముళ్ల మూడు రోజుల పండుగ. సామాన్యుల్లో రాజకీయ చైతన్యానికి నాంది పలుకుతూ.. తెలుగునాట ఆరాధ్య నటుడు నందమూరి తారక రామారావు 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించారు. జనహృదయాల్లో చెరగని ముద్రవేసి తొమ్మిది నెలల్లోనే అఖండ విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీపై పసుపు జెండాను ఎగురవేశారు. ఆనాటి నుంచి ప్రతియేటా ఎన్టీఆర్ జన్మదినం పురస్కరించుకుని 'మహానాడు' మూడు రోజుల పండుగను పసుపుదళం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తూ వస్తుంది. 43వ మహానాడు పండుగను నేటి నుంచి కడప గడపపై ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో ఏర్పాట్లు ఘనంగా చేశారు. ఈ వేడుక నిర్వహణ కమిటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్‌లతో పాటు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిలు ఉన్నారు. సోమవారం ప్రత్యేక ఆహ్వానం అందుకున్న ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు కడపకు బయలు దేరారు. 28న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రతి నియోజకవర్గం నుంచి 5 వేల మందికి తగ్గకుండా కడపకు తరలివెళ్లారు.



మిగతా 4వ పేజీలో

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ రంజిత్ బాషా
- నిర్లక్ష్యం చేసిన సిబ్బందిపై చర్యలకు ఆదేశం



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కర్నూలు నగరంలోని కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించిన భూసర్వే ఏడీకి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, సర్వేశాఖలో రెండు ఫిర్యాదులు బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లాయని, సంబంధిత సర్వేయర్లను సస్పెండ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని జేసీని ఆదేశించారు. అధికారులు వారం రోజుల అర్జీలను చూడకుండా ఉంటే, వారికి మెమోలు జారీ చేయాలని తదుపరి డిసిప్లినరీ యాక్షన్ తీసుకోవాలని కలెక్టర్ డీఆర్వోను ఆదేశించారు. అర్జీలు చూడకుండా ఉన్న శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలను ఆదేశించారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు.

ట్రైనర్ల రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలి: జేసీ

యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా మండలాల్లో ట్రైనర్ల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య సూచించారు. అదేవిధంగా జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి కార్యక్రమాల నిర్వహణకు వేదికలను గుర్తించాలని జేసీ సంబంధిత అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి: జేసీ

ఓర్వకల్లు, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగాంధ్రలో భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. సోమవారం యోగాంధ్ర క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని సోమయాజులపల్లె బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మ్యూజియంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ నవ్య మాట్లాడుతూ జిల్లాలో మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర-2025 క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో యోగా కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం యోగా ట్రైనర్లు కార్యక్రమానికి హాజరైన వారితో ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, డ్వామా పీడీ రమణయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యా సాగర్, రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, గ్రామ సర్పంచ్ జయమ్మ, నాయకులు కాకి దేవేంద్ర, శ్రీరామ శ్రీనివాసరెడ్డి, నాగమల్లేష్, ప్రతాప్, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

తుంగభద్రకు జలకళ

డ్యాంలో 11 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ



మేఘాలతో కమ్మేసిన తుంగభద్ర జలాశయం

హాలహర్వి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ఆరంభంలోనే తుంగభద్ర జలాశయానికి భారీగా వరద పోటెత్తింది. ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల రోజురోజుకి నీటి నిల్వ పెరుగుతోంది. సాధారణంగా మే నెలలో తుంగభద్ర ప్రాజెక్టులో నీటి నిల్వ డెడ్ స్టోరేజీకి పడిపోతుంది. కానీ ఈ ఏడాది ఎగువ ప్రాంతాలైన శివమొగ్గ ఆగుంబె, హరిహర, మలేనాడు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల ముందస్తుగా వరదనీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. దీంతో నాలుగు రోజులుగా 5 టీఎంసీలు నీరు జలాశయంలోకి వచ్చి చేరడంతో 11 టీఎంసీలకు చేరింది. తుంగభద్ర జలాశయం కింద సాగు చేసుకునే రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాధారణంగా తుంగభద్ర జలాశయానికి జూన్ రెండో వారంలో ఇన్‌ఫ్లో ప్రారంభమవుతుంది. ఈ ఏడాది ముందస్తు రుతుపవనాల రాకతో వరద పోటెత్తుతోంది. వారం రోజుల క్రితం 6 టీఎంసీలు నిల్వ ఉన్న జలాశయం ప్రస్తుతం 11 టీఎంసీలకు చేరుకుంది. దీంతో కర్నూలు, అనంతపురం, బళ్లారి జిల్లాల పరిధిలోని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయానికి 6,595 క్యూసెక్కుల మేర వరద కొనసాగుతోంది.

'పీఆర్' ఉద్యోగుల్లో టెన్షన్

- సీనియారిటీకి ప్రాధాన్యమిస్తారా?
- ఇన్‌చార్జిలు, ఎఫ్ఏసీల స్థానాలను మార్చేరా.?
- నేడు 'అనంత'లో ఉద్యోగులకు కౌన్సెలింగ్

5

వేరుశనగ ధర రూ.6,287



విక్రయానికి వచ్చిన వేరుశనగ

ఆదోని అగ్రికల్చర్, మే 26(ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వేరుశనగ ధర సోమవారం క్వింటా గరిష్ఠంగా రూ.6,287కు వ్యాపారులు కొనుగోలు చేశారు. గత వారంతో పోల్చితే వేరుశనగ ధర క్వింటాకు రూ.500 పతనమైంది. ఖరీఫ్ సీజన్ ఆరంభపు వేళలో జరగడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదోని మార్కెట్‌యార్డుకు 122 వేరుశనగ బస్తాలు విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.5,689, గరిష్ఠ ధర రూ.6,287, సగటున రూ.6,232 పలికింది.

వానలే.. వానలు



(3వ పేజీతరువాయి)

అదేవిధంగా కందులు, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న, మిర్చి, ఉల్లి, పొద్దుతిరుగుడు, వరి తదితర పంటలన్నీ కలిపి మరో 4 లక్షల హెక్టార్లలో సాగవుతాయని జేడీలు కమిషనర్‌కు పంపిన నివేదికలో పేర్కొన్నారు.

3.50 లక్షల టన్నుల ఎరువులు అవసరం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 6.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయనీ, దాదాపు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల మేర యూరియా డీఏపీ, కాంప్లెక్స్ తదితర ఎరువులు అవసరమవుతాయని నివేదికలో తెలిపారు. ఈసారి ఎరువుల పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు ఉండకపోవచ్చని ఉమ్మడి జిల్లాకు అవసరమైన ముఖ్యమైన ఎరువులు డీఏపీ యూరియా ఎరువులను పూర్తిస్థాయిలో ప్రభుత్వం అందించేందుకు చర్యలు చేపడుతోందని కర్నూలు జేడీ వరలక్ష్మి, నంద్యాల జేడీ మురళీకృష్ణ వెల్లడించారు.

నాసిరకం విత్తనాలపై నిఘా

పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలకు సంబంధించి నాసిరకం విత్తనాలు రైతుల దరి చేరకుండా చర్యలు చేపట్టేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. 2021-23 సంవత్సరాల్లో ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంట సాగుకు సంబంధించి నాసిరకం పత్తి విత్తనాల వినియోగం కారణంగా రైతులు భారీగా నష్టపోయారు. ఈ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఉమ్మడి జిల్లాల వ్యవసాయ శాఖ జేడీలు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ నష్టానికి సంబంధించి రైతులకు నష్టపరిహారం అందించకుండా ఎరువుల కంపెనీ యజమాన్యాలకే వత్తాసు పలకడం దారుణమని అప్పట్లో రైతులు ఆందోళన చెందారు. కూటమి ప్రభుత్వమైనా ఆ నష్టాన్ని తమకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రస్తుతం రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఖరీఫ్‌లో జిల్లాలో వివిధ పంటల సాగు విస్తీర్ణం ఇలా..

పంట	విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	12,919
జొన్న	313
సద్ద	3,939
మొక్కజొన్న	5,101
కొర్ర	2,679
కందులు	33,296
పెసలు	203
వేరుశనగ	54,710
పొద్దుతిరుగుడు	826
ఆముదం	8,951
పత్తి	2,34,409
చెరుకు	127
మొత్తం	**3,57,633**

ఈసారి పంటల సాగుకు అనుకూలం



గత సంవత్సరం మాదిరే ఈసారి కూడా మే నెలలోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. ఈ వానలు ముందస్తు పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. చీడపీడలు దరిచేరవు. గత సంవత్సరం ఖరీఫ్‌లో పత్తి 2.34 లక్షల హెక్టార్లలో సాగైంది. ఈసారి మరో 14వేల హెక్టార్లలో అధికంగా సాగయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీకి సంబంధించి 40 శాతం సబ్సిడీని అందిస్తోంది. రైతులకు నాణ్యమైన వివిధ పంటలకు సంబంధించి విత్తనాలు అందించేందుకు చర్యలు చేపట్టాం. రైతులు తప్పనిసరిగా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే ముందు సంబంధిత దుకాణం డీలర్లతో రసీదులు తీసుకోవాలి. డీలర్లు ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరను వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తాం. లైసెన్సులు కూడా రద్దు చేసేందుకు వెనుకాడం.

- వరలక్ష్మి, వ్యవసాయ శాఖ జేడీ

కర్నూలును టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: కలెక్టర్



టీబీ ముక్త్ భారత్ అభియాన్ పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్/హాస్పిటల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలును టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులకు పిలుపునిచ్చారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జూన్ 2వ తేదీన ప్రారంభమవుతుందని తెలిపారు. ఇంటెన్సిఫైడ్ టీబీ ప్రచారానికి, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ-పీడీ, మెప్మా పీడీ వంటి అన్ని ఇతర విభాగ అధికారులు ఈ జాతీయ ప్రాధాన్యత చొరవతో చురుకుగా పాల్గొని సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డీఎస్ఎంవో డాక్టర్ జి.మల్లికార్జున రెడ్డి, జిల్లా టీబీ సహాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కారుమబ్బుల కాంతిరేఖ..

నీలి ఆకాశంలో తేలినట్లు కనిపిస్తున్న కారుమబ్బులపై సోమవారం సాయంత్రం ఏర్పడ్డ ఇంద్రధనస్సు ఆకట్టుకుంది. ఓవైపు చిన్నపాటి వర్షతుంపరలు పడుతుండగా సప్తవర్ణాలతో మేఘాలకు హారంగా మారింది. ఉత్తర, దక్షిణ దిక్కులను కలిపినట్లు హరివిల్లు విప్పారింది. దీంతో పలువురు తమ సెల్‌ఫోన్లలో ఇంద్రధనస్సును బంధించారు. సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. కారుమబ్బులకు కాంతిరేఖ మాదిరి ఇంద్రధనస్సు వర్ణశోభితమయింది.

- కోడుమూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

గిరిజనుల అభివృద్ధికి చర్యలు

కర్నూలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన వర్గాల సామాజిక- ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచి వారి అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా దేశంలోని 549 జిల్లాలోని 63,843 గిరిజన గ్రామాలను మార్చడం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 500 మంది జనాభా, అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన కనీసం 50 శాతం గిరిజన నివాసితులు కలిగిన జిల్లాలోని గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, సామాజిక- ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం ఈ పథకం లక్ష్యం అన్నారు. వ్యక్తిగత కమ్యూనిటీ స్థాయిలో హౌసింగ్, రోడ్డు, ఎల్‌పీజీ తదితర మౌలిక వసతుల కల్పన, వైద్య, ఆరోగ్యం పోషకాహారం, విద్య, శిక్షణ విద్యుద్దీకరణ, కనెక్టివిటీ, ఆర్థిక సాధికారత లక్ష్యాలతో 17 శాఖల ద్వారా ఈ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో 7 గ్రామాలను ఈ పథకం కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి తండా, నెరణికి, హొళగుంద మండలంలోని హొళగుంద, కోగిలతోట, మద్దికెర మండలంలోని పెరవలి, మద్దికెర (తూర్పు), హంపా గ్రామాలను ఈ పథకం కింద అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గందరగోళం!



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్రీధర్

- వ్యవసాయ శాఖ కౌన్సెలింగ్‌లో ఇష్టారాజ్యం
- ఒక్కొక్కరికి ఒక్కో న్యాయం అన్న విమర్శలు
- జాబితాలో ముందున్న వారికే రిక్వెస్ట్ బదిలీలు
- కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులే చెల్లుబాటు

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. అనంతపురం జేడీఏ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు సంబంధించి ఏడీఏలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ నేతృత్వంలో ఆయా జిల్లాల జేడీఏలు ప్రక్రియలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నందాకా సీనియర్ అసిస్టెంట్లు, ఏడీఏలు, మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా ఏఓలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో జేడీఏ కార్యాలయ ఆవరణలో సందడి నెలకొంది. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారితోపాటు రిక్వెస్ట్ కింద పలువురు ఉద్యోగులు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఐదేళ్లు పూర్తయిన అధికారులు, ఉద్యోగులను వారు ఇచ్చిన మూడు ఆప్షన్లలో ఒక స్థానాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. రిక్వెస్ట్ కింద బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే న్యాయం చేసినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ జాబితాలో ముందున్న కొందరికే రిక్వెస్ట్ బదిలీకి అంగీకరించారు. ఆ తర్వాత జాబితాలోని అధికారులు, ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా కౌన్సెలింగ్‌లో చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కేడర్లలో ఐదేళ్లు పూర్తికాని స్థానాలకు ఇతర అధికారులను బదిలీ చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఇదే తరహాలో దరఖాస్తు చేసుకున్న మరికొందరు అధికారుల దరఖాస్తులను పక్కనపెట్టినట్లు సమాచారం. కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులను ఓకే చేసి.. అక్కడికక్కడే అధికారులకు ఖరారు చేసి పంపినట్లు సమాచారం. మరికొందరి సిఫార్సులను బుట్ట దాఖలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు మేనేజ్ నేపథ్యంలోనే పలువురు అధికారులు వారు కోరుకున్న స్థానాలకు పంపకుండా ఆపేసినట్లు చర్చ సాగుతోంది. ఏడీఏలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు రాష్ట్రస్థాయిలో ఫైనల్ చేస్తారు. ఏడీ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులనే దాదాపుగా రాష్ట్ర ఉన్నతాధికారులు ఓకే చేసే పరిస్థితి ఉంది. ఇక్కడ తమకు అన్యాయం జరిగిందని భావించిన అధికారులు, ఉద్యోగులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను కలిసే అవకాశం ఉన్నా.. అక్కడికి వెళ్లేవారు తక్కువేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. రిక్వెస్ట్ బదిలీల్లో అన్ని కేడర్లలో కొందరు ఉద్యోగులకు ఒక న్యాయం.. మరికొందరికి మరో విధంగా వ్యవహరించడంపై బాధిత వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వ్యవసాయ శాఖ యూనియన్లలో ఆఫీస్ బేరర్లుగా ఉన్న అధికారులు, ఉద్యోగులకు చేదు అనుభవం ఎదురైనట్లు తెలిసింది. ఆఫీస్ బేరర్లు.. కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. బదిలీల సమయానికి కలెక్టరేట్ నుంచి ప్రొసీడింగ్స్.. కమిటీకి అందకపోవడంతో తమకు ఏ స్థానం కేటాయిస్తారోనన్న సందేహాలను ఆ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

దరఖాస్తు చేయకపోయినా..

వ్యవసాయశాఖలో బదిలీకోసం దరఖాస్తు చేయనివారికి సైతం స్థానచలనం కలుగుతోంది. ఒక స్థానాన్ని అయినవారికి కేటాయించేందుకు అక్కడున్నవారిని కదిలిస్తున్నారు. ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారాన్ని అడగకుండా బదిలీ చేసేస్తున్నారు. ఈ జాబితాలో కేవలం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారు, చార్జెస్ ఉన్నవారు కూడా ఉండటం గమనార్హం. అయినవారికి ఇవ్వాలనుకుంటే తమకు సమాచారమైనా ఇవ్వాలి కదా..?



కౌన్సెలింగ్ హాల్ బయట ఎదురుచూస్తున్న అధికారులు

చెప్పాపెట్టకుండా ఎలా బదిలీ చేస్తారని బాధితులు నిలదీస్తున్నారు. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చేక్రమంలో తమను బలిపశువులను చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ తతంగానికి జేడీఏ కార్యాలయం వేదికైంది. కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం రాత్రి తలుపులు వేసుకుని మరీ కానిచ్చేశారు. ఈ అక్రమాల వెనుక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక ఆ శాఖ ఉన్నతాధికారుల అక్రమాలు ఉన్నాయా అన్న చర్చ జరుగుతోంది.

విత్తులో జాగ్రత్త..!

- పంటల సాగులో విత్తన ఎంపికే కీలకం
- అప్రమత్తంగా లేకపోతే చివరికి నష్టాలే

ఆత్మకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ముందస్తుగానే నైరుతీ రుతు పవనాలు రాష్ట్రాన్ని తాకుతున్నాయి. దీంతో సకాలంలో తొలకరి వర్షాలు కురుస్తుండటంతో అన్నదాత ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్నారు. అయితే పంటల దిగబడుల్లో అత్యంత కీలకం విత్తనమే. సరైన విత్తనాన్ని ఎంచుకున్నట్లయితే అధిక దిగుబడులను సాధించవచ్చు. అదే నకిలీ, నాసిరకంగా విత్తనాల వినియోగిస్తే చివరికి నష్టాలే మూటకట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో ముందు నుంచే విత్తనాల ఎంపిక పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకించి పంటల దిగుబడులు ఆశాజనకంగా రావాలంటే ఎరువులు, పురుగుల మందులతో పాటు విత్తనాల కొనుగోళ్లలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే నామమాత్రపు దిగుబడులు కూడా రాక పెట్టుబడులు చేతికి అందక నష్టాలను భరించాల్సి వస్తోంది. గతంలో అనేక సందర్భాల్లో రైతులు నకిలీ, నాసిరకం విత్తనాలను సాగుచేసి నష్టాలను చవిచూశారు. నకిలీ కంపెనీల విత్తనాలపై విజిలెన్స్, వ్యవసాయాధికారులు అనేక తనిఖీలు చేస్తున్నప్పటికీ మార్కెట్‌లో నకిలీ విత్తనాలు జోరు తగ్గడం లేదు. ఈ పరిస్థితుల్లో అన్నదాతలే విత్తనాల ఎంపికలో ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉంది.



జాగ్రత్తలు తీసుకోండి

ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తన ప్యాకెట్ తయారైన తేదీ (డీఓపీ), పరీక్షించిన తేదీ (డీఓటీ), గడువు తేదీ సరిగా ఉన్నాయో లేవో సరిచూసుకోవాలి. విత్తన సంచులు చిరిగినా, రంధ్రాలు ఉన్నా, తడిసిన విత్తనాలను కొనుగోలు చేయకపోవడం ఉత్తమం. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమశాతాన్ని కూడా చూసుకోవాలి.

అక్రమార్కుల వలలో చిక్కొద్దు..

కొంత మంది వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు అమ్మే వారి వద్ద కొనుగోలు చేయరాదు. కొన్ని నకిలీ కంపెనీలకు చెందిన విత్తనాలను బ్రాండెడ్ కంపెనీ అంటూ ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో తప్పుడు ప్రచారం చేస్తూ ఆయా గ్రామాల్లోని పెద్దమనుషులతో సంప్రదించి గ్రామంలోని రైతులందరు గంపగుత్తగా అవే విత్తనాలను కొనుగోలు చేసేలా ఒత్తిళ్లు చేస్తుంటారు. అలాంటి విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. తక్కువ ధరలకే విత్తనాలంటూ కొందరు లూజుగా విక్రయాలు జరుపుతుంటారు. ధర తక్కువని ఆశ పడితే చివరికి నష్టాలు తప్పవు. ఇలాంటి వ్యక్తుల గురించి వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

నిషేధిత విత్తనాలకు దూరంగా ఉండాలి

పత్తికి సంబంధించి బీటీ-3 రకం విత్తనాలు కొనుగోలు చేయకూడదు, సాగు చేయరాదు. పర్యావరణానికి పెనుముప్పుగా మారి ఈ రకం పత్తి విత్తనాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో పాటు వీటిని నిషేధించింది. దీంతో బీటీ-3 పత్తి రకం విత్తనాలను కొనవద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నప్పటికీ అక్కడక్కడ చోట్ల రైతులు బీటీ-3 రకం విత్తనాలను గుట్టుగా విక్రయిస్తున్నారు. అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో రైతులు అక్కడక్కడ రహస్యంగా ఈ విత్తనాలను వేస్తున్నారు. కాగా ఇప్పటికే నిషేధిత విత్తనాల అమ్మకాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టారు.





పొలంలో విత్తనాలు విత్తుతున్న కూలీలు

రైతులు జాగ్రత్తలు పాటించాలి



రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు కొనుగోలు చేసేందుకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా విత్తన లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలి. అలాగే కొనుగోలుకు సంబంధించిన రశీదును తప్పనిసరిగా పొందడంతో పాటు కొనుగోలు చేసిన విత్తనాల నమూనాలు, వాటి ప్యాకెట్‌ను భద్రపర్చుకోవడం ఉత్తమం. మాయమాటలతో నాసిరకం, నకిలీ కంపెనీల విత్తనాల అమ్మే వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి. అలాంటి వారి గురించి వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఒకవేళ నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోయినట్లయితే పూతదశలో ఉన్నప్పుడే వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి. శాస్త్రవేత్తల సూచనలతో నష్టనివారణ చర్యలకు చొరవ తీసుకుంటాం. ప్రత్యేకించి విత్తన నాణ్యతను తెలుసుకునేందుకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఉండే అగ్రి బయో ల్యాబ్‌లో సీడ్ శాంపిల్స్ తీసుకొచ్చినట్లయితే వాటిని పరీక్షించి ఉచితంగానే ఫలితాలను వెల్లడిస్తాం. నిషేధిత విత్తనాలను విక్రయించినా కేసు నమోదు చేస్తాం.

- ఆంజనేయులు, ఏడీఏ, ఆత్మకూరు

పసుపు పండుగ..!

(3వ పేజీ తరువాయి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా కాంగ్రెస్ పార్టీ హవా నడుస్తున్న రోజులవి. 1982 మార్చి 29న మధ్యాహ్నం 2:30 గంటలకు హైదరాబాద్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ వేదికగా జరిన సభలో తెలుగుప్రజల ఆరాధ్య నటుడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ప్రకటించారు. 'నేను తెలుగువాడిని.. నాది తెలుగుదేశం పార్టీ.. నా పార్టీ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం' అంటూ చారిత్రాత్మక ఘట్టానికి ఊపిరి పోశారు ఎన్టీఆర్. ఆ తరువాత 1982 ఏప్రిల్ 11న హైదరాబాద్ నిజాం కాలేజీ మైదానం వేదికగా టీడీపీ తొలి బహిరంగ సభ జరిగింది. ఆ సభకు ఉమ్మడి జిల్లా నుంచి బీవీ మోహన్‌రెడ్డి (కర్నూలు), శేగు వెంకటరమణయ్యశెట్టి (డోన్), సోమిశెట్టి వెంకటేశ్వర్లు (కర్నూలు), ఉచ్చప్ప (పత్తికొండ), తంగడంచ వెంకటస్వామి (నందికొట్కూరు), బీవీ రెడ్డి (కర్నూలు), సంజీవరెడ్డి (నంద్యాల) తొలి టీడీపీ సభకు హాజరయ్యారు. ఎన్టీఆర్ వెంట నడిచి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 1982 మే 28న తిరుపతిలో జరిగిన సభకు కర్నూలు జిల్లా నుంచి పెద్దఎత్తున ఎన్టీఆర్ అభిమానులు తరలివెళ్లారు. సామాన్యుల్లో రాజకీయ చైతన్యం కలిగించాలనే ఆశయంలో ఎన్టీఆర్ 'చైతన్య రథయాత్ర'కు శ్రీకారం చుట్టారు. శ్రీశైలం మల్లికార్జునస్వామి, భ్రమరాంబదేవిలకు ప్రత్యేక పూజలు చేసి ఎన్టీఆర్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో చైతన్య రథయాత్రకు శ్రీకారం చుట్టారు. ఆత్మకూరు, నందికొట్కూరు, కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, డోన్, బనగానలపల్లె, నంద్యాల, ఆళ్లగడ్డ మీదుగా సాగింది. 20 రోజులపాటు ఈయాత్రలో మమేకమయ్యామని నాడు ఎన్టీఆర్ అడుగుల్లో అడుగులేసిన సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆంధ్రజ్యోతికి వివరించారు. 1983 ఉన ఎన్నికల్లో బీవీ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు నుంచి పోటీ చేసి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో స్థానం సంపాదించారు.

కడపకు తెలుగు తమ్ముళ్లు

కడప నగర శివారున సీకే దిన్నె కేంద్రంగా తెలుగుదేశం పార్టీ 43వ మహానాడు నేటి నుంచి (27, 28, 29వ తేదీల్లో) మూడు రోజులు జరుగనుంది. 27, 28వ తేదీల్లో టీడీపీ ప్రతినిధుల సమావేశం ఉంటుంది. టీడీపీ జాతీయ, రాష్ట్ర కమిటీల్లో ముఖ్య హోదాలో ఉండే నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర ప్రతినిధుల సమావేశాలకు హాజరవుతారు. అలాగే యువనేత నారా లోకేశ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా 'జీవితకాల సభ్యత (లైఫ్ టైం మెంబర్‌షిప్)' నమోదుకు ఈ ఏడాది శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లాలో 24, నంద్యాల జిల్లాలో 13 మంది లైఫ్ టైం సభ్యులు ప్రతినిదుల సభకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 2 వేల మందికి పార్టీ నుంచి ఆహ్వానాలు అందాయి. పార్టీ ఆదేశాల మేరకు జీవితకాల సభ్యతం నమోదు చేసుకున్న నాయకులను సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తదితరులు సన్మానించి ప్రత్యేక ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఉమ్మడి జిల్లాకు 750కి పైగా బస్సులతో పాటు నాయకులు ఎవరికి వారు ప్రత్యేక వాహనాల్లో బయల్దేరారు.



మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌కు ప్రత్యేక ఆహ్వానితుల పాసును అందజేస్తున్న టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

బందోబస్తుకు 907 మంది

కడపలో నిర్వహించే మహానాడు బందోబస్తు కోసం కర్నూలు జిల్లా నుంచి 448 మంది పోలీసులు, 43 మంది ఏఆర్ పోలీసులు, నంద్యాల జిల్లా నుంచి 391 మంది పోలీస్ సిబ్బంది, 25 మంది ఏఆర్ పోలీస్ సిబ్బందితో పాటు నాలుగు స్పెషల్ పార్టీలు నియమించారు. కర్నూలు జిల్లా నుంచి సీఐలు 25 మంది, ఎస్ఐలు 35, ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్లు 55, పోలీస్ కానిస్టేబుళ్లు 200, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుళ్లు/కానిస్టేబుళ్లు 28, మహిళా పోలీసులు 30, హోంగార్డులు 70 ముంది, మహిళా హోంగార్డులు ఐదుగురు చొప్పున 448 మందిని నియమించారు. ఏఆర్ విభాగం నుంచి డీఎస్పీ-1, ఆర్ఐ-1, ఆర్ఎస్ఐలు-6, ఏఆర్ ఏఎస్ఐ/హెజీలు-20, ఏఆర్‌పీసీలు-15 కలిపి 43 మందితో పాటు రెండు స్పెషల్ పార్టీలను నియమించారు. అలాగే.. నంద్యాల జిల్లా నుంచి అడిషినల్ ఎస్పీ-1, సీఐలు- 20, ఎస్ఐలు-30, ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్లు-40, పోలీస్ కానిస్టేబుళ్లు-180, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుళ్లు/కానిస్టేబుళ్లు-20, మహిళా పోలీసులు 25, హోంగార్డులు-70, మహిళా హోంగార్డులు 5 మంది చొప్పున 391 మందిని నియమించారు. ఏఆర్ విభాగం నుంచి అడిషినల్ ఎస్పీ-1, ఆర్ఐ-1, ఆర్ఎస్ఐలు-2, ఏఆర్ ఏఎస్ఐ/హెజీలు-15, ఏఆర్‌పీసీలు-6 కలిపి 25 మందితో పాటు రెండు స్పెషల్ పార్టీలను నియమిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే బందోబస్తు విధుల్లో భాగంగా పోలీస్ సిబ్బంది కడపకు చేరుకున్నారు.

ఉపకార వేతనాలు విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి): 2023-24 విద్యాసంవత్సరానికి గానూ సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడికల్, ఇతర కోర్సులు చదువుతున్న ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు కళాశాలలకు మంజూరైన ఉపకార వేతనం 2024 మార్చి 1వ తేదీ వరకు మొదటి విడత ఫీజును విడుదల చేసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి కె.తులసీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నాలుగు విడతల ఫీజు విడుదలైందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జమ అయిన నగదు మొత్తాన్ని కళాశాల యాజమాన్యాలకు చెల్లించారో లేదో అన్న విషయాన్ని కర్నూలు జిల్లా వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ వారి పరిధిలో విద్యార్థులకు సంబంధించి 2023-24 విద్యాసంవత్సరానికి మంజూరు కళాశాల ఉపకార వేతనం (ఆర్‌టీఎఫ్) బకాయిలను సంబంధిత కళాశాల ఖాతాలకు జమ చేశారో లేదో సర్వే చేసి సంబంధిత సమాచారాన్ని జ్ఞానభూమి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోపు సంబంధిత జ్ఞాన భూమి యాప్‌లో కళాశాల విద్యార్థులు ఫీజు ప్రభుత్వం మంజూరు చేసిందని, మిగతా ఫీజును విద్యార్థులు చెల్లిస్తే రశీదును జ్ఞాన భూమి యాప్‌లో సంబంధిత అధికారులు అప్‌లోడు చేయాలన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.గోకులపాడు



జయమాదులు (ఫైల్)

గ్రామానికి చెందిన రైతు బెస్త జయమాదులు(45) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. ఐదున్నర ఎకరాల సొంత పొలంతో పాటు మరో 4 ఎకరాల మామిడి తోట కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పంటల సాగుకు రూ.10 లక్షల అప్పు చేశాడు. పంటల సాగులో నష్టం రావడంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక మదనపడ్డాడు. ఆదివారం సాయంత్రం పొలం పని ముగించుకుని, రాత్రి భోజనం అనంతరం పురుగు మందు తాగాడు. వాంతులు, విరేచనాలు కావడంతో గమనించిన భార్య అడగంతో తాను పురుగు మందు తాగానని చెప్పాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య బెస్త జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆదోని రూరల్, మే 26 ఆంధ్రజ్యోతి): మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన గొల్ల మద్దయ్య (52) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల మేరకు.. సోమవారం వర్షం కురియడంతో ఇంటి వద్ద నీరు నిలిచింది. మోటారు ద్వారా నీటిని తోడే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యారు. స్థానికులు ఆదోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

'పది' మెయిన్ పరీక్షలు పూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మెయిన్ పరీక్షలు సోమవారం ముగిశాయని డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు 4,962 మంది నమోదు చేసుకున్నారని, వీరిలో 3,697 మంది పరీక్షకు హాజరు కాగా.. 1,265 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు. డీఈవో 5 పరీక్ష కేంద్రాలను, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ 2, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 11 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

కర్నూలు అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 1,776 మంది దరఖాస్తు చేసుకోగా 1,620 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. కోసిగి ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడటంతో వారిని డిబార్ చేశామని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, మే 26(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో జోన్ జాతీయ రహదారిలో మానస డాబా ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న ఓ కారు ఆయన్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. ట్రాఫిక్ స్తంభించడంతో నాలుగో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ట్రాఫిక్ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. స్థానికులను విచారిస్తే ఎవరూ కూడా ఆ వ్యక్తిని గుర్తించలేదు. ఆచూకీ తెలిసిన వారు 9121101063 నెంబర్‌కు ఫోన్ చేయాలని తాలుకా పోలీసులు తెలిపారు.



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

'పీఆర్' ఉద్యోగుల్లో టెన్షన్

- సీనియారిటీకి ప్రాధాన్యమిస్తారా?
- ఇన్‌చార్జిలు, ఎఫ్ఏసీల స్థానాలను మార్చేరా.?
- నేడు 'అనంత'లో ఉద్యోగులకు కౌన్సెలింగ్



నంద్యాల, మే 26 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ పరిధిలోని పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో బదిలీ టెన్షన్ తారాస్థాయికి చేరుకుంది. తాజా ప్రభుత్వ బదిలీ ఉత్తర్వుల ప్రకారం.. రాయలసీమ జోన్-4 పరిధిలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో పంచాయతీరాజ్ శాఖలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీకి సంబంధించిన కౌన్సెలింగ్ మంగళవారం అనంతపురం జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యాలయంలో జరుగనుంది. దీంతో ఆయా ఉద్యోగులందరూ ఉదయాన్నే సదరు కౌన్సెలింగ్‌కు హాజరుకానున్నారు. ఈ కౌన్సెలింగ్ ఆ శాఖ ఈఎన్‌సీ బాలునాయక్ ఆధ్వర్యంలో జరుగనుంది. ఈ క్రమంలో ఎవరిని ఎక్కడకు బదిలీ చేస్తారోనన్న ఆందోళన అందరిలో నెలకొంది. అయితే సీనియారిటీ ప్రాతిపాదికన కౌన్సెలింగ్ నిర్వహిస్తారా..? లేక ఎఫ్ఏసీ, ఓడీల రూపంలో పనిచేస్తున్న వారిని ఆయా స్థానాల నుంచి కదిలిస్తారా..? అర్హులకు తగిన న్యాయం జరుగుతుందా? అన్న సందేహాలు ఆ శాఖ వర్గాల్లో ఉంది. రాయలసీమలోని జోన్-4 పరిధిలోని ఉద్యోగులను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే 26 మంది డీఈఈలు ఉండగా 161 మంది ఏఈ, ఏఈఈలు ఉన్నారు. డీఈఈలు అనంతపురంలో ఏడుగురు, కడపలో 9 మంది, చిత్తూరులో ఐదుగురు, కర్నూలులో ఐదుగురు చొప్పున ఉన్నారు. అదేవిధంగా ఏఈలు, ఏఈఈలను పరిశీలిస్తే అనంతపురంలో 49 మంది, చిత్తూరులో 59, కడపలో 33 మంది, కర్నూలు 20మంది ఉన్నారు. నిబంధనల మేరకు ఐదేళ్లు దాటిన డీఈఈలు 11 మంది ఉండగా ఏఈలు, ఏఈఈలు 19 మంది ఉన్నారు. వీరితో పాటు టెక్నికల్ ఆఫీసర్స్, ఏటీఓలు, జేటీఓలు, సూపరింటెండెంట్లకు బదిలీలు ఉంటాయి. సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్‌ల పరంగా కొందరు కౌన్సెలింగ్‌కు హాజరవుతారు. అంతేకాకుండా రిక్వెస్ట్ బదిలీ కూడా కొన్ని ఉంటాయని సమాచారం.

ఉద్యోగుల్లో వీడని ఉత్కంఠ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీ రాజ్‌శాఖ పరంగా.. రెండో సారి ఉద్యోగుల బదిలీకి సంబంధించి తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది ఆగస్టులో మొదటి విడల బదిలీ కౌన్సెలింగ్ జరిగింది. ఆ తర్వాత నేడు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయితే ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగులకు తప్పనిసరి బదిలీతో రిక్వెస్ట్ బదిలీలకు అవకాశం కల్పించడంతో ఎవర్ని ఎక్కడికి బదిలీ చేస్తారో...? అనే భయం బాధిత వర్గాల్లో నెలకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలా మంది పైరవీలు చేసి ఇష్టారాజ్యంగా పోస్టింగ్ పొందారనే విమర్శలు లేకపోలేదు. అదే తరహాలో కూటమి ప్రభుత్వంలోను మొదటి విడతలో జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌లతో పాటు ఆ తర్వాత కొందరు ఉద్యోగులు ప్రజాప్రతినిధుల సిఫార్సు లెటర్స్‌తో పైరవీలు చేసి పోస్టింగ్‌లు పొందరానే విమర్శలు లేకపోలేదు. తద్వారా సీనియారిటీతో పాటు అర్హులైన వారికి అన్యాయం జరిగిందనే ఆరోపణలు ఆశాఖ వర్గాల్లోనే లేకపోలేదు. ఈ నేపథ్యంలో కనీసం నేడు జరిగే బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియలోనైనా అర్హులైన న్యాయం జరిగే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదిలా ఉండగా.. గత కౌన్సెలింగ్‌లో పైరవీలు చేసి రూ. లక్షలు ఖర్చులు చేసి ఇన్‌చార్జి(ఎఫ్ఏసీ, ఓడీలు) డీఈఈ పోస్టింగ్‌లు పొందిన వారి పరిస్థితి అగమ్యాగోచరంగా మారింది. తమ పోస్టింగ్ ఉంటుందా..? ఊడుతుందా..? అని ఆందోళన నెలకొంది. ఏదిఏమైనా నేడు జరిగే కౌన్సెలింగ్‌తో ఆ శాఖ ఉద్యోగుల్లో ఉత్కఠం వీడటం లేదని తెలుస్తోంది.

పాతుకు పోయారు..!

పంచాయతీ రాజ్ శాఖలో పీఆర్ఐ, పీఐయూ, క్యూసీ విభాగాలు ఉన్నాయి. అయితే ఏళ్ల తరబడి బదిలీలు జరిగినా కూడా చాలా మంది ఉద్యోగులు విభాగాల్లోనే పాతుకుపోతున్నారు. పీఆర్ఐలో పనిచేస్తున్న ఉద్యోగి అదే పీఆర్ఐలోని మరో డివిజన్‌కు బదిలీ అవుతున్నారే తప్ప... మరోక విభాగమైన క్యూసీ, పీఐయూ విభాగాలకు బదిలీ కావడం లేదు. పీఐయూ, క్యూసీ విభాగాల్లోనే ఇదే తరహాలో వ్యవహారం సాగుతోంది. ఇదీచాలదన్నట్లు.. నిత్యం ఆఫీస్ విభాగాల్లో కూడా చాలా మంది ఉద్యోగులు ఆఫీస్ విభాగాలకే బదిలీ అవుతుండటం పలు విమర్శలకు తావిస్తోంది. చాలా మంది ఉద్యోగులు సైతం ఫీల్డ్ ఉద్యోగాలకు బదిలీ కాకుండా తమదైన శైలిలో చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కౌన్సెలింగ్‌లో కొందరు ఉద్యోగులకు డిప్యుటేషన్ రూపంలో అన్యాయం జరుగుతోందని సమాచారం.

సీనియారిటీకి ప్రాధాన్యమిస్తారా?

కౌన్సెలింగ్‌లో సిఫార్సులు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా అర్హులైన ఉద్యోగులను సీనియారిటీ ప్రాతిపాదికన న్యాయం చేస్తారా? లేదా? అనే సందేహాలు ఉద్యోగుల్లో నెలకొంది. డీఈఈలతో పాటు ఏఈ,ఏఈఈల ఖాళీలలు ఎక్కువగా ఉండటంతో ఆయా పోస్టింగ్‌లపై ఉత్కంఠ నెలకుంది. పైగా రెగ్యులర్ డీఈఈలు లేకపోవడంతో పైరవీలకు ఆస్కారం ఎక్కువగా ఉందని ఆశాఖ వర్గాల్లో చర్చసాగుతోంది. వీటికితోడు ఇదివరకే కొందరు ఏఈ,ఏఈఈలు సైతం తమదైన శైలిలో పైరవీలు చేసి ఎఫ్ఏసీ, ఓడీల రూపంలో డీఈఈలుగా పనిచేస్తున్నారు. దీంతో ఆయా వారిని తాజా కౌన్సెలింగ్‌లో తప్పించి మిగిలిన వారికి న్యాయం చేయాలన్న డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

'బాధితులకు న్యాయం చేస్తాం'



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేసామని డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ బాబు ప్రసాద్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 101 ఫిర్యాదులు వచ్చాయి. డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్, స్పెషల్ బ్రాంచ్ సీఐలు కేశవరెడ్డి, తేజమూర్తి ఉన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి హైదరాబాదుకు చెందిన శిరీష, భాను రాథోడ్ రూ.3 లక్షలు తీసుకుని నకిలీ ఆఫర్ లెటర్ ఇచ్చి మోసం చేశారని కర్నూలు గణేష్ నగర్‌కు చెందిన జమున ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ డిపార్టుమెంటులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం గానీ, రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం గానీ ఇస్తామని చెప్పి కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన సురేష్ రూ.6 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు బాలాజీనగర్‌కు చెందిన నివేదిత ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు తన వివరాలు సేకరించి తమ పేరు మీద అసభ్య పదాజాలతో వివిధ అడ్రస్సుల పేర్లతో ఉత్తరాలను రిజిస్టర్ పోస్టు కూడా చేస్తున్నారని కర్నూలు మద్దూరునగర్‌కు చెందిన నగేష్ ఫిర్యాదు చేశారు. తమపై ఉన్న కేసులు కొట్టివేసినా కూడా పొలాలను వ్యవసాయం చేసుకోనీయకుండా అడ్డుపడుతున్నారని, కొంత మంది వ్యక్తులు వచ్చి దుర్భాషలాడుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గ్రామంలోకి రానీయడం లేదని మంత్రాలయం మండలం, తిమ్మాపురం గ్రామానికి చెందిన సుధాకర్, సుదర్శన్, నర్సప్ప ఫిర్యాదు చేశారు. తన కుమారుడు మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని కొడుతున్నాడని, ఇంట్లో ఉన్న వస్తువులు పగులకొట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు పాతబస్తీకి చెందిన విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు పోటీలు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు పోటీలు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం పర్యావరణ ఇంజనీరు పీవీ కిషోర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు మే 28న చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఏర్పాటు చేస్తున్నామని, విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. మాధవీనగర్‌లోని సైన్స్‌పార్కు సమీపంలోని రవీంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఈ పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 99128 07127 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.



జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్లు

- పోర్టల్ హైపర్ టెన్షన్ రోగులకు శస్త్రచికిత్సలు విజయవంతం



రోగులతో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మే 26(ఆంధ్రజ్యోతి): పోర్టల్ హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్న అనంతపురం, నంద్యాల జిల్లాలకు చెందిన ఇద్దరు మహిళా రోగులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సర్జరీ వైద్యులు శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఈ మేరకు సోమవారం శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించిన సీనియర్ సర్జరీ ప్రొఫెసర్ డా.పి.రామకృష్ణ నాయక్ అసోసియేట్ ప్రొఫెసర్ సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.మన్సూర్‌బాషా, డా.ప్రణీత్, అనస్థీషియా ప్రొఫెసర్ డా.సుధీర్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.మురళి ప్రభాకర్ వైద్య బృందాన్ని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సర్జరీ హెచ్‌వోడీ డా.హరిచరణ్ అభినందించారు.

సర్జరీ ప్రొఫెసర్ డా.రామకృష్ణ నాయక్ అరుదైన శస్త్ర చికిత్స వివరాలను విలేకరులకు వివరించారు. అనంతపురం జిల్లా బాల వెంకటాపురానికి చెందిన 29ఏళ్ల పర్వీన్ గర్భాశయ రక్తస్రావంతో బాధపడుతూ ఏప్రిల్ 27వ తేదీ ఆసుపత్రిలో చేరిందని తెలిపారు. పోర్టల్ హైపర్‌టెన్షన్‌తో బాధపడు తున్న ఆమెకు ఎండోస్కోపిలో అన్నవాహికలో వేరిసెస్ గుర్తించి బ్యాండ్‌లిగేషన్ అనంతరం పెద్దపరిమాణంలో కొల్లాటెరల్స్, పోర్టల్ క్యావెర్నోమా గుర్తించినట్లు తెలిపారు. స్ప్లీనెక్టమీ ఈ నెల 3వ తేది నిర్వహించగా, స్ప్లీన్ బరువు 1.5 కిలోలుగా నమోదైందని చెప్పారు. ప్రాథమికంగా 50వేలు ఉన్న రక్తకణాలు అనంతరం 4లక్షలకు పెరిగిం దని, ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉందని తెలిపారు.

అలాగే నంద్యాల జిల్లా పాములపాడుకు చెందిన 15 ఏళ్ల ఎలిషారాణి వాంతుల్లో రక్తస్రావం వంటి లక్షణాలతో ఈ నెల 5వ తేదీన అడ్మిషన్ పొందగా, 8వ తేదీన ఆపరేషన్ నిర్వహించినట్లు డా.రామకృష్ణ నాయక్ తెలిపారు. రోగి వచ్చిన సమయానికి హిమోగ్లోబిన్ 6 గ్రాములు, ప్లేట్‌లెట్ కణాలు 60వేలుగా ఉండటంతో ఎండోస్కోపి బ్యాండ్‌లిగేషన్ చేశామని చెప్పారు.

అనంతరం ఆపరేషన్ పరిశీలనలో స్ప్లీనోరినల్ స్టంట్ ఆపరేషన్‌ను ఈ నెల 6వ తేదీ నిర్వహించగా, రోగి రక్తకణాలు 5 లక్షలకు పెరిగాయని తెలిపారు. ఆపరేషన్ అనంతరం లక్షణాలు బాగా తగ్గిపోయి రోగి ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో అనస్థీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డా.మురళి ప్రభాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.రఘు ప్రవీణ్, డా.సంధ్యా, జనరల్ సర్జరీ, పీజీ వైద్య విద్యార్థులు డా.సర్పరాజ్, డా.సాయిచరణ్, డా.శిరీష పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

- పొలం అగ్రిమెంట్ పత్రాలపై మోసపూరితంగా సంతకాలు
- సాయం చేసిన వ్యక్తిపై దాడి చేశారు
- కోసిగి పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

కోసిగి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి సంతకం చేయించుకొని మోసం చేశారని సజ్జల గుడ్డం గ్రామానికి చెందిన హరిజన ఎల్లప్ప ఆవేదన వ్యక్తం చేశారు. తనకు సజ్జలగుడ్డం మజార గ్రామమైన దేవరబెట్టలో సర్వే నెంబరు 28/2ఏలో 30 సెంట్లు, 28/3ఏలో 95 సెంట్ల భూమి ఉందని తెలిపారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితుడు ఎల్లప్ప

గ్రామంలో డ్రైనేజీ కాలువలు క్లీన్ చేసే ఉద్యోగం ఇప్పించి, నెలకు రూ.10వేలకు జీతం ఇప్పిస్తామని నమ్మించి మోసం చేశారని అన్నారు. ఉద్యోగ నియామక పత్రాలు అని చెప్పి తమ నాన్న పేరు మీద ఉన్న పొలంలో 50 సెంట్లను గజ్జప్ప కుమారుడు ఎల్లప్పకు భాగం ఇచ్చినట్లు మోసపూరితంగా అగ్రిమెంటుపై సంతకం చేయించుకున్నారన్నారు. వైసీపీ నాయకులు తనపై, తనపై భార్యపైన కూడా దాడి చేశారని, ఇదే విషయాన్ని ఆదోని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈనెల 25న చదును కోసం తమ పొలాన్ని ట్రాక్టరుతో దున్నిస్తుండగా.. వైసీపీ నాయకులు ఎల్లప్ప, ఉలిగప్ప, కురువ వెంకటేశ్ అడ్డుపడి తన వెంట వచ్చిన వ్యక్తిపై దాడి చేసి గాయపరిచారని అన్నారు. కురువ వెంకటేశ్ అనే వ్యక్తి కులం పేరుతో దూషించి కాలితో తన్నాడన్నారు.

ఇదే విషయంపై కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ హనుమంత రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఎల్లప్ప తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ హనుమంత రెడ్డిని వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

గడువులోగా పరిష్కరించాలి: కమిషనర్



కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన అర్జీలను నిర్దీత గడువులోగా పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 21 అర్జీలు వచ్చాయి. మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ సత్య నారాయణ, ఆర్ఓ జునైద్, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

సి.బెళగల్: మాజీ సైనికుడు శ్రీనాథ్‌రెడ్డి పట్టా భూములను ఆక్రమించుని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ పురుషోత్తంకు బ్రాహ్మణదొడ్డి గ్రామానికి చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో విచారించి తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

● మండలంలోని పోలకల్లు, బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బురాన్ దొడ్డి, క్రిష్ణదొడ్డి గ్రామాల్లోని ఎల్లెల్సీ కాలువల్లో పెరిగిన ముళ్ల కంపలను తొలగించాలని రైతులు సోమన్న, నాగరాజు, లింగన్న, వెంకటరెడ్డి కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు.

ఆపరేటర్లను తొలగించడం అన్యాయం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ



మాట్లాడుతున్న రాధాకృష్ణ

కర్నూలు న్యూసిటీ, మే 26(ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం అన్యాయమని, తిరిగి వారికి కొనసాగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఆపరేటర్లు ర్యాలీలో పాల్గొన్నారు. రాధాకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థను ఎండీయూ మొబైల్ వాహనాల ద్వారా నేరుగా ప్రజలకు బియ్యం సరఫరా చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దు చేసి వేలాది మంది ఆపరేటర్లను తొలగించడం దారుణమన్నారు. న్యూసిటీ ఆటో యూనియన్ కార్యదర్శి బి.రాధాకృష్ణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. కేశవయ్య ప్రధాన కార్యదర్శి అక్బర్ వలి పాల్గొన్నారు.

మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్‌కు అనుమతి ఇవ్వాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 26(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్‌కు అనుమతి ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు మాట్లాడుతూ 2021లో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సర్వీసు పాయింట్ ఇవ్వాలని, ఎస్‌జీటీ నుంచి ఎస్ఏగా డీఎస్సీ ద్వారా రిక్రూట్ అయిన ఉపాధ్యాయులకు సర్వీసు పాయింట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు కరుణా నిధిమూర్తి మాట్లాడుతూ ప్రత్యేక కేటగిరి కింద ఉపాధ్యాయుల బదిలీల్లో ఎస్‌జీటీలకు 40 శాతం, స్కూల్ అసిస్టెంట్లకు 50 శాతం బ్లాకింగ్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో యూటీ ఎఫ్ రాష్ట్ర నాయకుడు సురేష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, ఆప్టా ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్, రవికుమార్, నవీన్‌పాటి, జనార్దన్, ఆనందం, కృష్ణారెడ్డి, రంగన్న, రామకృష్ణ, నాగిరెడ్డి, నాగస్వామి నాయక్, లక్ష్మయ్య శివయ్య, నగరి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన



చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీర్ కార్మికులు

గూడూరు, మే 26(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీర్ కార్మికులు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. సోమవారం గూడూరులోని పాత బస్టాండ్‌లో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఇంజనీరింగ్ కార్మికులు మాట్లాడుతూ గత 19 రోజులుగా వివిధ రకాలుగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అరవింద్, దూకేశ్వర రావు, బసవరాజు, మధు, ఆంజనేయులు, షబ్బీర్, జయన్న. ఖాజాహుసేన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

● పొలం పనుల్లో అన్నదాతలు బిజీ
● విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధం



విత్తనం వేస్తున్న రైతు

ఓర్వకల్లు, మే 26 (ఆంధ్రజ్యోతి): ముందస్తు కురుస్తున్న వర్షాలకు రైతన్నలు సాగుకు సన్నద్ధమవుతున్నారు. రైతులు విత్తనం వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది పత్తి తదితర పంటలు వర్షాలు లేక తెగుళ్ల సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారైనా నమ్ముకున్న భూమి గట్టెక్కించకపోదా అని రైతులు మరోసారి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. మండలంలో పత్తి 800 హెక్టార్లు, కంది 200 హెక్టార్లు, ఆముదం 100 హెక్టార్లు, మొక్కజొన్న 1000 హెక్టార్లు, మినుములు 100 హెక్టార్లు, వేరుశనగ 500 హెక్టార్లలో సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అయితే.. వర్షం మొదలవడంతో రైతులు తమ పొలాలను దున్ని దుక్కిలు చేసుకుంటూ బిజీ బిజీ అయ్యారు. గత ఏడాది వేసిన పంటలకు దిగుబడి చేతికి రాకపోవడంతో రైతులు అప్పుల వలయంలో కూరుకుపోయారు. ప్రభుత్వం మండలాన్నీ కరువు మండలంగా ప్రకటించినప్పటికీ చాలా మంది రైతులకు నష్టపరిహారం అందక ఆర్‌బీకే కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాదైనా తమ తలరాతలు మారు తాయని, అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఏర్పడింది.

పొలాన్ని సిద్ధం చేసుకున్నాం



గత ఏడాది పదెకరాల్లో పత్తి పంటను సాగు చేశాం. అయితే.. పంటపై లక్షల పెట్టుబడి పెట్టాం. దీంతో తెగుళ్లతో దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయాం. పత్తి పంట చేతికొచ్చే సమయానికి అంతుపట్టని తెగుళ్ల సోకడం, చెట్టుకున్న కాయ రాలిపోవడం, గిట్టుబాటు ధర లేక పోవడంతో తీవ్రంగా నష్టపోయాం. పంటలు సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధ చేశాం.

\- నజీర్, రైతు

నష్టాలే అధికం



గత ఏడాది వేసిన పంటలు దెబ్బతిని అప్పులే మిగిలాయి. పంట దిగుబడి కూడా రాలేదు. అప్పుల ఊబిలో కూరుకుపోయాం. ఈ ఏడాదైనా మా తలరాతలు మారుతాయన్న ఆశతో పొలంలో విత్తనాలు వేసేందుకు సన్నద్ధమయ్యాం.

\- గడేకారి శేఖర్, రైతు

సబ్సిడీ విత్తనాలు అందించాలి



పొలాల్లో విత్తనం విత్తేందుకు సిద్ధంగా ఉన్నాం. గత ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయి లో సబ్సిడీ విత్తనాలు అందించి ఆదుకోవాలి.

\- రామకోటేశ్వరరావు, రైతు

ఒత్తిడికి దూరంగా ఉండాలి : సూపరింటెండెంట్



బీపీ చెక్ చేస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పని ఒత్తిడికి దూరంగా ఉండాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో వెల్‌నెస్ క్లీనిక్‌లో రక్తపోటు అవగాహన మాసోత్సవ కార్యక్రమం జరిగింది. రక్తపో టుపై హౌస్ సర్జన్లతో రోగులకు హెల్త్ టాక్ కార్యక్రమాన్ని సూపరిం టెండెంట్ ప్రారంభించారు. స్వయంగా సూపరింటెండెంట్ రోగులకు బీపీ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరంతరం హెల్త్ చెకప్, రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవడం వల్ల గుండె, స్ట్రోక్ జబ్బులకు దూరంగా ఉంచువచ్చన్నారు. అనంతరం హౌస్ సర్జన్లు వివిధ పోస్టర్లు, బొమ్మల ద్వారా రోగులకు బీపీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డా.సుధాకుమారి, డాక్టర్ సింధియా శుభప్రద, సీఎస్ఆర్ఎంవో బి.వేంకటేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్సీ సావిత్రీబాయి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, మే 26(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని 21వ వార్డు ఎన్జీవో, ఎఫ్‌సీఐ కాలనీల్లో రూ.48.32 లక్షలతో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎం చంద్రబాబు రూ.50 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, డీఈఈ నరేష్, ఏఈ భార్గవి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ: స్థానిక మాధవీనగర్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే గౌరు చరిత సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.

క్రీడాభివృద్ధికి సహకారం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, మే 26(ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి సహకారం అందిస్తామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. సోమవారం ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో కిడ్స్ వరల్డ్‌లోని కొనిజేటి రోశయ్య హాలులో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను టీజీ వెంకటేశ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్ర మంలో న్యాయవాది ఎం.శ్రీధర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసులు, తైక్వాండో జిల్లా అధ్యక్షుడు లింగేశ్వరుడు, ఇన్‌చార్జి సతీష్ కుమార్, నంద్యాల ఇన్‌చార్జి అబ్దుల్ మజీద్, తైక్వాండో మాస్టర్లు వీరేష్‌బాబు, శివకుమార్, పరమేశ్వర్, హరిబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వ కార్డులు జారీ

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జీవిత కాలం సభ్యత్వం తీసుకున్న 24 మందికి అధిష్టానం ఆదేశాల మేరకు సభ్యత్వ కార్డులు అందజేశామని పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో కోడుమూరు ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ లతో కలిసి సభ్యత్వ కార్డులు అందజేశారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో టీడీపీ నిర్వహించే మహానాడుపై వైసీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం హాస్యాస్పదమన్నారు. మహానాడుకు ప్రతి నియోజకవర్గం నుంచి వేలాదిగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చేందుకు అన్నీ ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, కేవీ సుబ్బారెడ్డి, హనుమంతరావు చౌదరి, వడ్డెర సంఘం నాయకుడు తిరుపాల్ బాబు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

ఓర్వకల్లు, మే 26(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఓంకార్ యాదవ్ సోమవారం తనిఖీ చేశారు. ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో జరుగుతున్న పది సోషల్ పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేసి చీఫ్‌లకు, డిపార్టుమెంటు ఆఫీసర్లకు పలు సూచనలిచ్చారు.

మహానాడును విజయవంతం చేద్దాం

సి.బెళగల్, మే 26(ఆంధ్రజ్యోతి): ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానాడుకు మండలంలోని టీడీపీ కార్యకర్తలంతా భారీగా తరలిరావాలని కోరారు. మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, జడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ గోవిందు, బాషా పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ

కర్నూలు కల్చరల్, మే 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సోమవారం రాత్రి వేంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం నిర్వహించిన వేసవి సంగీత, నృత్య శిక్షణలు ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పొందిన బాలబాలికల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సుంద రయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జేఎన్ శేషయ్య, కళాక్షేత్రం కమిటీ సభ్యుడు యాగంటీశ్వరప్ప, శిక్షణ సంస్థ నిర్వాహకులు మల్లీశ్వరి, దేవిశ్రీ పాల్గొన్నారు.

ఏటవాలుగా దుక్కి చేసుకోవాలి: ఏవో

సి.బెళగల్, మే 26(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నీటి బొట్టు భూమిలో ఇంకిపోయేలా ఏటవాలుగా దుక్కి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన రైతులతో సమావేశమయ్యారు. మల్లేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

మహిళ అరెస్టు

కర్నూలు అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): నాటుసారా కేసులో నీలిషికారి మాధవి అనే మహిళను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ చంద్రహాస్ తెలిపారు. సోమవారం సాయంత్రం నగరంలోని బంగారుపేటలో నవో దయం -2లో భాగంగా నాటుసారా స్థావరాలు, అమ్మకాలపై దాడులు నిర్వహించారు. మాధవి 15 లీటర్ల నాటుసారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ నవీన్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆటోకు నిప్పు

కర్నూలు క్రైం, మే 26(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గురుబ్రహ్మ నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఆటోకు నిప్పం టించారు. ఎస్‌బీఐ బ్యాంకు లైన్‌లో నివాసముంటున్న మహబూబ్ బాషా అనే వ్యక్తి తన ఇంటి ముందు ఆటోను పార్కింగ్ చేశాడు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆటోకు నిప్పంటించి పరారయ్యారు. ఈ ఘటనలో ఆటో పూర్తిగా దగ్ధమైంది. బాధితులు నిద్రలేచి మంటలార్పినా ఫలితం లేకపోయింది. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న మునిస్వామి

కోడుమూరు, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తున్న కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అజయ్ భాస్కర్‌పై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మునిస్వామి డిమాండ్ చేశారు. కర్నూలు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కార్యదర్శిపై కలెక్టర్ రంజిత్‌బాషాకు ఆయన ఫిర్యాదు చేశారు. మునిస్వామి మాట్లాడుతూ కోడుమూరు పట్టణం ఒకటో వార్డులోని ఎస్సీ కాలనీలో పంచాయతీ అనుమతి లేకుండా కార్పెంటర్ నిర్వాహకులు మిషన్ ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు పంచాయతీ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రజలు నివశిస్తున్న ఇళ్ల మధ్యలో కార్పెంటర్ మిషన్ ఏర్పాటు చేయడం వలన అక్కడ శబ్ధ, దుమ్ము, ధూళి వంటి కాలుష్యంతో ప్రజలు, చిన్న పిల్లలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు మొర పెట్టుకున్నారు. అక్కడ కార్పెంటర్ మిషన్ ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కల్గించినప్పటికీ కార్యదర్శి విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు కార్పెంటర్ నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని కలెక్టర్‌కు విన్నవించాడు. తక్షణమే ఆ ప్రాంత్రంలో కార్పెంటర్ మిషన్‌ను తొలగించాలని కలెక్టర్‌ను కోరారు.

సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలి

కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ధర్నా



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జగన్నాథం

కర్నూలు న్యూసిటీ, మే 26(ఆంధ్రజ్యోతి): రైతులకు 90 శాతం సబ్సిడీతో అన్ని రకాల విత్తనాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జిల్లా కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ధర్నా నిర్వహించారు. జగన్నాథం మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులంతా పొలాలు సాగు చేసుకుంటున్నారన్నారు. ఈఏడాది రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇచ్చే విషయంలో ప్రభుత్వం చేతులేత్తేసిందన్నారు. కార్యక్రమంలో నగర కార్యవర్గసభ్యుడు సోమన్న, నాయకులు బాబయ్య, రబియా, సురేష్, రామాంజనేయగౌడు, మల్లికార్జున పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరిపించాలి



ఉపకులపతికి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): గత ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ అవినీతిపై విచారణ జరిపించాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.భాస్కర్ కోరారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి వి.వెంకట బసవరావుకు ఏఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఎం. రాఘవేంద్రతో కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌టీకే నాయక్ తన 8 నెలల కాలంలో సివిల్ పనుల టెండర్స్ భవన నూతనికీకరణ పేరుతో నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేశారని, వర్సిటీ అభివృద్ధి కోసం కేటాయించిన రూసా నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఆయనపై సీబీసీఐడీ, ఈడీలతో దర్యాప్తు చేయించాలని కోరారు.

డాక్టర్ నగేష్‌కు సన్మానం

కర్నూలు అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో కృషి చేస్తున్న కళా సంస్కృతి సేవా అధ్యక్షుడు డాక్టర్ కె. నగేష్‌ను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం నగరంలోని 43వ వార్డులో డాక్టర్ నాగేష్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. బహుజన సేవా సమితి అధ్యక్షుడు కాశపోగు గిడ్డన్న, రిటైర్డు ఎంఆర్‌వో ఎస్ సయ్యద్‌రోషన్ ఆలీ, రచయిత డి.పార్వ తయ్య, కేఆర్‌పీ ఫౌండేషన్ యూట్యూబర్ హనివర్షారెడ్డి, టీవీ నటుడు రాజ్, ఆర్ఎంపీ రమేష్, ఎస్సీ సామాజిక కార్యకర్త దేవరాజు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, మే 26(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, తొలగించిన 45 మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కార్మికులకు మద్దతుగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేయ డానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్ని కల ముందు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపుతామని హామీ ఇచ్చారని అన్నారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, సీఐటీయూ నగర కార్యదర్శి సాయిబాబా, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు నల్లన్న, రాము, నాగరాజుపాల్గొన్నారు.

ఒత్తిడి పెంచాలి: ఆవాజ్ కమిటీ

కర్నూలు న్యూసిటీ, మే 26(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాలని కోరుతూ కూటమి ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. సోమవారం జొహరాపురంలో షేక్ నూర్ వలి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా అనేక రకాల చట్టాలను తీసుకువచ్చిందన్నారు. అధ్యక్షుడు ఇర్ఫాన్ బాషా, కార్యదర్శి నూరువలి, ఉపాధ్యక్షుడు అజామహిద్దీన్, సాదిక్ షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

అదనపు భారం సరికాదు



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు హాస్పిటల్, మే 26(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో ఈహెచ్‌ఆర్ నమోదుతో అదనపు భారం పడుతుందని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ మినిస్ట్రీరియల్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివనాగి రెడ్డి, కార్యదర్శి మధుసూదన్ అన్నారు. సోమవారం మినిస్ట్రీరియల్ ఉద్యోగులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీహె చ్‌సీలో ఈహెచ్‌ఆర్ నమోదు చేయాలన్న ఆదేశాలపై నిరసన తెలిపారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు, రిజిస్ట్రేషన్ బాధ్యతల నమోదు తమ పని కాదన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో పి.శాంతికళకు వారు వినతిపత్రం అందజేశారు.

పూర్తికాని వంతెన

● చింతకుంట వద్ద జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు ● పత్తాలేని కాంట్రాక్టర్, అవస్థలు పడుతున్న వాహనదారులు



నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు

ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలను కలిపే ఎన్‌హెచ్167 పనుల్లో భాగంగా హాలహర్వి మండలం చింతకుంట వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు ఆగిపోయాయి. తాత్కాలిక వంతెన వర్షం దెబ్బకు కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పత్తా లేడు.

హాలహర్వి, మే 26(ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాలను కలిపేందుకు 2017లో కేంద్ర ప్రభుత్వం 167 జాతీయ రహదారిని ఏర్పాటు చేసి నిధులు విడుదల చేసింది. ఈ రహదారి కర్ణాటక రాష్ట్రం హగరి వద్ద ప్రారంభమై ఆంధ్ర సరిహద్దు చింత కుంట మీదుగా ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, రాయచూరు నుంచి తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల, మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, కోదాడ వరకు మొత్తం 483 కి.మీ.లు ఉంటుంది.

కర్ణాటకలో పూర్తయిన రహదారి

విడతలవారీగా నిధులు మంజూరు చేస్తూ, రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టారు. కర్ణాటక రాష్ట్రంలో ఐదేళ్ల క్రితమే పనులు పూర్తి కాగా మన రాష్ట్రంలో మాత్రం పెండింగ్ పడింది. చింతకుంట నుంచి ఆదోని వరకు రహదారి నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేశారు.

నిలిచిన పనులు

ఆంధ్ర సరిహద్దు నుంచి ఆదోని వరకు ఎస్ఆర్‌కె సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ఆరేళ్ల క్రితమే పనులు వేగవంతం చేసింది. అయితే హాలహర్వి మండలం చింతకుంట వద్ద నిర్మాణం ఆగిపోయింది. ఆలూరు వద్ద రోడ్డు కేవలం పట్టణంలో మాత్రమే రోడ్డు నిర్మించి మిగతా చోట్ల వదిలేశారు.

పత్తాలేని కాంట్రాక్టర్

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పత్తా లేడు, ప్రజాప్రతినిధులు కూడా పట్టించు కోవడం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారులు ఇటువైపు రావడమే మానేశారు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు.

తెగిన తాత్కాలిక వంతెన



వాగు ఉధృతికి దెబ్బతిన్న తాత్కాలిక వంతెన

వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాల దెబ్బకు కత్రవాగు ఉగ్రరూపం దాల్చింది. దీంతో తాత్కాలిక వంతెన కొట్టుకుపోయి వాహ నాల రాకపోకలకు ఆటంకటం ఏర్పడింది. హగరి, ఉరవకొండ, అనంత పురం, ఆదోని, ఆలూరు, బళ్లారి, కర్నూలు వెళ్లే వాహనా రాకపోకలన్నీ స్తంభించిపోయాయి. ఈ రహదారిపై వచ్చిన వాహనదారులు వంతెన పరిస్థితి చూచి మళ్లీ వెనక్కు వెళ్లిపోతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా



చింతకుంట వాగుపై వంతెన పనులు ఐదేళ్లుగా నిలిచిపోయాయి. చిన్న వర్షం వచ్చినా తాత్కాలిక వంతెను కొట్టుకుపోతుంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ తీరుపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను.
- విరుపాక్షి, ఎమ్మెల్యే, ఆలూరు

కాంట్రాక్టర్‌పై చర్యలకు నివేదిక పంపాం

చింతకుంట నుంచి ఆదోని వరకు జాతీయ రహదారి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. కనీసం వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని చెప్పినా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. వర్షాలు ఆగిపోతే తాత్కాలిక వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- శంకర్‌రెడ్డి, నేషనల్ హైవే ఈఈ, కర్నూలు**

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



ఆదోని, మే 26 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం రాత్రి విలేకరుల సమావే శంలో మాట్లాడారు. డివిజన్‌లోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, మట్టి గృహాల్లో నివాసించేవారు సుర క్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలన్నారు. ఈదురు గాలులు, ఉరుములు మెరు పులతో కూడిన వర్షాలు కురిసే బహిరంగ ప్రదేశాల్లో చెట్ల కింద, విద్యుత్ పోల్స్ టవర్స్, మట్టిమిద్దెల్లో ఉండవద్దన్నారు. విద్యుత్ తీగలు తెగిపడే అవకాశముందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూం నెం. 8333989012 కు ఫోన్ చేయాలని సూచించారు.

కొవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

● హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ కుమార్

ఆదోని టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కేసులు నమోదు అవుతున్నాయని, పజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.సందీప్ కుమార్ హెచ్చరించారు. సోమవారం మాట్లాడుతూ జాగ్రత్తలు తీసుకోకుంటే కేసులు వేగంగా విస్తరించే ప్రమాదం ఉందన్నారు. మాస్కు ధరించి, భౌతిక దూరం పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శానిటైజర్‌తో చేతులను శుభ్రం చేసుకోవాలని కోరారు. హెల్త్ సర్వే చేస్తున్నామని హోం ఐసోలేషన్ కిట్లను సిద్ధం చేశామని తెలిపారు. ఎవరూ అసత్య సమాచారాన్ని ప్రచారం చేయరాదన్నారు.

మహానాడుకు తరలిరండి

వెల్దుర్తి, మే 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించనున్న టీడీపీ 'మహానాడు'కు కార్యకర్తలు తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు సుబ్బరాయుడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, కన్వీనర్ బలరాంగౌడ్ కోరారు. సోమవారం వెల్దుర్తిలో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి మంగళవారం ఉదయాన్నే స్థానిక పార్టీ కార్యాలయానికి సభ్యత్వ కార్డులతో రావాలన్నారు.

ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్లకు పాలు, గుడ్లు, చిక్కీలు సరఫరా చేసే ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాగంటి రాజు, సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ ప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఏజెన్సీ నిర్వాహకులు సరఫరా చేసే పాలు, గుడ్లు, చిక్కీలు గుడ్లు పరిమాణం తక్కువగా ఉన్నాయని నాణ్యత లేని చెడిపోయిన గుడ్లు, పాలు, మురిగిన చిక్కీలు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు.

ఉపాధి కోల్పోయాం ఆదుకోండి



వాహనాలతో నిరసన తెలుపుతున్నఆపరేటర్లు

మద్దికెర, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి నిత్యవసరాలు సరఫరాచేసే ఎండీయూ వాహనాల రద్దుతో ఉపాధి కోల్పోయమని తమను ఆదుకోవాలని ఎండీయూ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మద్దికెరలో తమ వాహనాలతో నిరసన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా వీటిపైనే ఆధారపడ్డామని, విధుల నుంచి తొలగించడం వల్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వాహనానికి ప్రతి నెలా కంతులు ఎలా కట్టాలని ప్రశ్నించారు. ఎండీయూ ఆపరేటర్లు షేక్షావలి, నవీన్ తదితరులు ఉన్నారు.

'కస్తూర్బా'లో సీట్లు భర్తీ

వెల్దుర్తి, మే 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తుర్బా గాంధీ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సీట్లు భర్తీ అయ్యాయని స్పెషల్ ఆఫీసర్ షాకీరా బేగం సోమవారం తెలిపారు. ఇంటర్మీడీయ్ మొదటి సంవత్సరంలో 40సీట్లకుగాను 29సీట్లు భర్తీ అయ్యాయని, మిగిలిన సీట్లు రెండో విడతలో భర్తీ చేస్తామని తెలిపారు.

సబ్సిడీ విత్తనాలు ఇవ్వండి

తుగ్గలి, మే 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అద్దంకి నాగార్జున యాదవ్ కోరారు. సోమవారం మండల జొన్నగిరిలో మాట్లాడుతూ తుగ్గలి మండలంలో ఎర్రనేల పొలాలు 90 ఎక్కువగా ఉన్నాయనీ, కంది, వేరుశనగ, సజ్జ సాగు చేస్తారన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేయలేదని, సరైన సమయంలో ఇవ్వకపోతే ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసి రైతులు నష్టపోతారన్నారు.

మహానాడును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

దేవనకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించనున్న టీడీపీ మహానాడును జయప్రధం చేయాలని పార్టీ నాయకులు బడిగింజల రంగన్న, వెంకటస్వామిగౌడ్, ఈదులదేవరబండ సుబాన్ పిలుపునిచ్చారు. సోమవారం దేవనకొండలో మాట్లాడతూ కార్యకర్తలు జాగ్రత్తలు పాటించి తరలిరావాలన్నారు. ఆకుల.వీరేష్, సిద్ద, భాస్కర్, రాజాసాబ్, మస్తాన్ పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరావాలి



మాట్లాడుతున్న నాయకులు

తుగ్గలి, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో నిర్వహించనున్న టీడీపీ మహానాడుకు తరలిరావాలని ఆ పార్టీ నాయకులు తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు చౌదరి పిలుపునిచ్చారు. సోమవారం మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావాలని అన్ని సౌకర్యాలు సిద్ధం చేశారన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించండి

● ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



దివ్యాంగురాలి నుంచి అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. సోమవారం కార్యలయంలో పబ్లిక్ గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని మండలంలోని సంబంధిత శాఖల అధికారులకు పంపుతూ గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యల్లో కొన్ని...

● తన భర్త మూకప్ప, 2023లో మరణించారని, వితంతు పెన్షన్ మంజూరు చేయాలని హొళగుందకు చెందిన మారెమ్మ అర్జీ ఇచ్చారు.

● తమ కాలనీ సమీపంలోని నీటి కుంటల్లో చేపల పెంపకానికి అనుమతి ఇవ్వాలని ఆదోని మండలం విజయనగర్ కాలనీకి చెందిన మత్స్యకారులు ప్రకాష్, శేఖర్, హుసేని, వీరేష్ అర్జీ సమర్పించుకున్నారు.

● తమ గ్రామంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, సరి చేయించాలని ఆదోని మండలం 104-బసాపురం గ్రామానికి చెందిన తిమ్మప్ప అర్జీ సమర్పించుకున్నారు.

● తనకు కల్లుబావి గ్రామ సర్వే నెం. 185లో 0.51 సెంట్ల భూమి ఉందని, ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఆదోనికి చెందిన ఈరన్న అర్జీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏవో వసుంధర, సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీవో రమణరెడ్డి, జలవనరుల డీఈ షఫీవుల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్ ప్రియ, ఆర్టీసీ డీఎం మహమ్మద్ రఫి, డిప్యూటీ డీఎం&హెచ్‌వో సత్యవతి, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు, డీటీ వలిబాషా, గుండాల నాయక్ పాల్గొన్నారు.

బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్ , మే 26(ఆంధ్రజ్యోతి) : బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎక్సైజ్ సీఐ సైదుల్లాకు వినతిపత్రం అందజేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా బెల్టు షాపులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నార న్నారు. వార్డులల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించని పక్షంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద మహిళలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వెంకటేష్, మెహన్ పాల్గొన్నారు.

పెసలబండ గ్రామంలో రీ సర్వే పూర్తి



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

ఆదోని రూరల్, మే 26 ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసలబండ గ్రామంలో భూ రీసర్వే పూర్తయినట్లు తహసీల్దార్ శివ రాముడు, రీసర్వే డిటి పెద్దయ్య అన్నారు. సోమవారం గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. దాదాపు 1,596 ఎకరాల భూమిని రీసర్వే చేశామని, అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పరిశీ లించి వీలైతే మళ్లీ సర్వే చేయించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

మున్సిపల్ ఉద్యోగులుగా గుర్తించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఆదోని టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): తమను మున్సిపల్ ఉద్యోగులుగా గుర్తించాలని కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయుకులు వీరా సాబ్, సోమన్న, అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నామని, సరైన వేతనాలు లభించకపోగా కుటుంబాలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. తమ ససమ్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పార్థసారథికి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు మూర్తి, శరత్, కైలాష్, వీరేష్, మహేష్, భరత్, కరీం రామాంజి పాల్గొన్నారు.

150 వాహనాల్లో మహానాడుకు

● టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్

ఆలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహించే మహానాడుకు 150 వాహనాల్లో వెళుతున్నట్లు ఈ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, నాయకురాలు జ్యోతి సోమవారం తెలిపారు. మండలాల ముఖ్య నాయకులకు బాధ్యతలు అప్పగించామని, ప్రొద్దుటూరులో విడిది ఏర్పాటు చేశామన్నారు.

టీబీ బాధితులకు పౌష్టికాహారం

ఆదోని టౌన్ , మే 26(ఆంధ్రజ్యోతి): టీబీ బాధితులకు పట్టణంలోని షరాఫ్ బజార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది సోమవారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. వైద్యాధికారి శేఖన్ భాను మాట్లాడుతూ, దాతలు ఆరునెలల పాటు పౌష్టికాహార కిట్లను అందిస్తారని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందించే మందులను తీసుకుంటే ఆరోగ్యం కుదుటపడుతుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ మెడికల్ ఆఫీసర్లు డా.అనిల్, డావినోద్ కుమార్, ఎంపీహెచ్ బాబురాజు, సూపర్వైజర్లు దోరతి, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

విత్తనాలకు రసీదు తీసుకోవాలి: ఏవో

ఆలూరు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు సంబంధిత డీలర్ల నుంచి రసీదులు తప్పక తీసుకోవాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్ గౌడ్ సూచించారు. సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన దుకాణాల్లో కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు పత్తి, కంది, మిరప విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లో నకిలీ, లూజు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుకాణాల్లో డీలర్లు స్టాక్, ధరల వివరాలను బోర్డులో ఉంచాలన్నారు.

యోగా చేయాలి

హాలహర్వి, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా చేయాలని ఎంపీడీవో వరలక్ష్మి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో యోగా పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, మే 26 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వ్యాదులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి సూచించారు. సోమవారం ప్రభుత్వ వైద్యశాలలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని, వాంతులు, విరేచనాలు అయితే ప్రభుత్వ వైద్యశాలకు రావాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని వసతులు, మందులు ఉన్నాయన్నారు. సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా ఉన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చాయి



విద్యావనరుల కేంద్రంలో సిద్ధంగా ఉన్న పుస్తకాలు

మద్దికెర, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈవో రంగస్వామి తెలిపారు. సోమవారం మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలతో పాటు కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలతో పాటు మొత్తం 26 పాఠశాలలకు పుస్తకాలు వచ్చాయని, సంబంధిత ఉపాధ్యాయులకు అందజేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవతో బోరు



గురుకుల పాఠశాలలో బోరు వేస్తున్న సిబ్బంది

పత్తికొండ, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాలలో నీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడే వారు. విషయాన్ని ప్రిన్సిపాల్ రామాంజ నేయులు నాయక్ ఎమ్మెల్యే శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పాఠశాలలో బోరు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పాఠశాలలో సోమవారం బోరు వేశారని, సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యేకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

విత్తనాలు పంపిణీ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దేవనకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ప్రారంభం కావడంతో ప్రభుత్వం రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం ఎఈవో రంగన్నకు వినతిపత్రం అందజేశారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు 90శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. నర్సారావ్ ఉన్నారు.

జోరువాన

● ఆదోనిలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం, మిగతా మండలాల్లోనూ..

ఆదోని అగ్రికల్చర్, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షం వల్ల రోడ్లు జలమయమయ్యాయి.ముందస్తుగా కురుస్తున్న వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ పనులు ముమ్మరం చేశారు. పొలాలు దుక్కి, దున్ని సాగుకు సమాయత్తమ వుతున్నారు.



ఆదోని ఆర్‌జీ నగర్ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



ఆలూరు మండలం కురకుంద గ్రామం బీసీ కాలనీ దుస్థితి



హాలహర్వి: దిగువ కాలువలో వర్షపునీరు



మద్దికెర : రహదారిపై నిలిచిన వర్షపునీరు

బురదమయంగా దారులు

ఆలూరు రూరల్: మండలలో వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల రహదారుల బుదరమయంగా మారాయి. కురకుంద, మొలగవల్లి, పెద్దహోతూరు, తుంబళబీడు, మరకట్టు, ముసనహళ్ళి తదితర గ్రామల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ లేకపోవడంతో నీరు ఇళ్ల ముందే నిలిచి దుర్వాసన వస్తోంది.

దిగువ కాలువకు నీరు

హాలహర్వి: మండలంలో వర్షాలు కురుస్తుండటంతో దిగువకాలువకు నీరు చేరుతోంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు జోరుగా వాన కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వేదవతి నది నిండుగా ప్రవహించడంతో రైతులు పత్తి సాగుకు సిద్ధమయ్యారు

మద్దికెర: బస్టాండు వద్ద బసవన్న గుడి రహదారిపై గుంతలు ఉండటంతో నీరు నిలిచింది. పంచాయతీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలూరు: పట్టణంలో కురిసిన వర్షానికి అరికెర రహదారి నడిచేందుకు వీలు లేకుండా చిత్తడిగా మారింది. దీంతో ప్రజలకు ఆ మార్గంలో వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.

ముడుపులు ముట్టచెబితేనే రిజిస్ట్రేషన్!

● ఎమ్మిగనూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు



ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఎమ్మిగనూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రతిపనికి చేయితడిపితేకాని ఫైల్ ముందుకు కదలడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ వైపు అవినీతి అంతమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు స్లాట్ బుకింగ్ అమలు చేసి నేరుగా ప్రజలే డాక్యుమెంట్ తయారుచేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకుంది. అయితే ఇందుకు భిన్నంగా ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి హెచ్చుమీరుతోంది. నిర్దేశిత ఫీజులకే రిజిస్ట్రేషన్లు చేయాలని నిబంధనలు ఉన్నా అవి క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదని ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

● **రోజూ 80 రిజిస్ట్రేషన్లు:**

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ దాదాపు 80వరకు వివిధ రకాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. భారీగా భూములు, స్థలాల రిజిస్ట్రేషను, ఆయకపు రిజిస్ట్రేషన్లు ప్రతిరోజు జరుగుతుండటంతో అధికారులు తమ చేతతివాటం చూపుతున్నారు. భూములు, స్థలాల రిజిస్ట్రేషన్ కోసం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చలానా ఎంత చెల్లిస్తారో ఆ మొత్తానికి ఒక శాతం అదనంగా ముడుపులు చెల్లిస్తేగాని రిజిస్ట్రేన్లు సవ్యంగా సాగటం లేదు. చేతులు తడపకుంటే ఏదో ఒక సాకు చూపించి డాక్యుమెంటేషన్ నిలిపేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పట్టణానికి చెందిన ఓ రైతు పొలాన్ని అతని ప్రమేయం లేకుండా, ఫేక్ పత్రాలతో అతని దాయాదులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై స్థానిక సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారికి ముడుపులు ముట్టజెప్పి జీపీ చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌పై రైతు స్థానిక, జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశాడు. దీంతో స్పందించిన జిల్లా అధికారి స్థానిక కార్యాలయాన్ని తనిఖీచేసి విచారణ చేసి రద్దుచేయాలని ఆదేశించారు. అయినప్పటికీ స్థానిక అధికారుల్లో మార్పు కనిపించటం లేదు. ఇక భూములు విలువ, రిజిస్ట్రేషన్ ఫీజలు అడిగేందుకు అమ్మకం, కొనుగోలుదారులు నేరుగా వెళ్తే మీకు ఇది అర్థం కాదు.. డాక్యుమెంటు రైటర్‌ను పంపించండి అంటూ అధికారి సుతిమెత్తగా సూచిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో చేసేదేమీలేక ప్రతి ఒక్కరు తప్పని పరిస్థితుల్లో డాక్యుమెంట్ రైటర్‌ను కలవాల్సి వస్తోంది. ఇక డాక్యుమెంట్ రైటర్లు కూడా తమదైన శైలిలో భారీమొత్తాలు దండుకుంటున్నారు. అంతేగాక భూములకు సంబంధించిన నకలు, ఈసీ, మార్కెట్ వ్యాల్యూ వంటి పత్రాలకోసం వెళ్తే డబుల్ ఫీజు వసూలు చేస్తు డబ్బులు దండుకుంటున్నారు. ఎవరైనా ఏమిటి అని అడిగితే ఏదో వంకతో తిప్పి పంపుతున్నారు. ఇదిలా ఉండగా భూములు, స్థాలాల కొనుగోలుదారులను స్టాంపుల కొరత వేదిస్తోంది. స్టాంపులు లభించక పోవటంతో కొరతను బూచిగా చూపి స్టాంప్ వెండర్లు ఇష్టానుసారంగా విక్రయిస్తూ ప్రజల నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు.

ఎలాంటి అవినీతి జరగటం లేదు



ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఫీజులు వసూలు చేస్తున్నాము. అదనంగా వసూలు చేస్తున్నార నేది అవాస్తవ ం. కార్యాలయం బయట మాపేరు చెప్పి డాక్యుమెంట్ రైటర్లు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనేది మాకు తెలియదు. మేము మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన మేరకే వసూలు చేస్తున్నాం. స్లాట్ బుకింగ్ ప్రకారమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. స్టాంపుల కొరత ఉంది. స్టాంపులు కావాలని ఉన్నతాధికారులకు ఇన్‌డెంట్ పంపాం. అధిక ధరలకు విక్రయించినట్లు మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాసులు, సబ్ రిజిస్ట్రార్, ఎమ్మిగనూరు

నాసిరకం విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి: ఏఐకేఎంఎస్



ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలో నాసిరకం విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలను సీజ్ చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సత్యన్న సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలంలోని పలు విత్తన దుకాణాల్లో నాసిరకం విత్తనాలను విక్రయిస్తున్నారన్నారు. అలాగే రైతులను మోసగించి తక్కువ ధర ఉన్న విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. వ్యవసాయ అధికారులు దాడులు నిర్వహించి, నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్న దుకాణాదారులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం వ్యవసాయ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్ నాయకులు పెద్దారెడ్డి, మల్లికార్జున, నరసింహులు, రాముడు, జయరాము, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు, బాబు, వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రుద్రగౌడు

కోసిగి, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్, విపత్తుల నివారణ శాఖ సూచనల మేరకు ఈ నెల 26నుంచి 30 వరకు కోసిగి మండలంలో భారీ వర్షాలు, గాలి వానలు, పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రుద్రగౌడు అన్నారు. సోమవారం తహీసల్దార్ రుద్రగౌడు మాట్లాడుతూ భారీవర్షాలు పడుతున్న సందర్భంలో ప్రజలు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నదులు, వాగులు, వంకల వద్ద నివాసితులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. పిల్లలు ఈత కోసం, ఇతరులు కూడా నదుల్లో చేపలు పట్టేందుకు వెళ్లవద్దన్నారు. పిడుగులు పడే ప్రమాదం ఉందని, ఎవరూ కూడా బహిరంగ ప్రదేశాల్లో చెట్ల కింద, ఎత్తయిన నిర్మాణాల వద్ద తలదాచుకోకూడదన్నారు. సురక్షితమైన బిల్డింగుల్లోనే ఉండాలన్నారు. రోడ్లపై ప్రవహించే నీటి కాలువలు, వంకలు, వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని గ్రామాల్లో దండోరా ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు.

● **మంత్రాలయం:** అల్ప పీడన ద్రోణీ ప్రభావంతో మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.రవి సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీఆర్వోలు, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలకు బయటకు రావద్దని సూచించాలన్నారు. మట్టి మిద్దెల్లో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయనీ, బహిరంగ ప్రదేశాల్లో చెట్ల కింద, విద్యుత్ స్థంబాలు, సెల్ టవర్లు, మట్టిమిద్దెల వద్ద ఉండకూడదన్నారు. ప్రమాదాలు సంభవిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చి ఆదోనిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు.

ఎల్లెల్సీ కాలువలో పూల తీగలు


గోనెగండ్లలో కాలువలో మొలకెత్తిన పూల తీగలు

గోనెగండ్ల, మే 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలోని మోడల్‌స్కూల్ దగ్గర ఉన్న ఎల్లెల్సీ కాలువ లో నీలిరంగు పూల తీగలు మెలకెత్తాయి. గత నెల 15వ తేదిన ఎల్లెల్సీ కాలువకు తుంగభద్ర డ్యాంనుంచి నీటి సరఫరా నిలిచి పోయింది. అయితే అరకొరగా అగిననీరు, కురిసిన వర్షం నీటితో కాలువలో నిలిచి ఉన్న చెత్తచెదారం పై నీలిరంగు పూల తీగలు పెరిగాయి.

'సరిహద్దులను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న హిందూ రుద్ర శ్మశానం సరిహద్దులను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ రుద్రస్మశాన వాటిక పరిరక్షణ కమిటీ నాయకులు బతుకన్న, బీఎల్ నారాయణ, పెద్దయ్య, యాపిలయ్య, నాగరాజుయాదవ్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాపురం కు చెందిన గోవర్ధన్‌రెడ్డి తన సొంత ప్లాటు స్థలానికి రస్తా పేరుతో శ్మశానం సరిహద్దులను తొలగించి మట్టిని వేశారని, చర్యలు తీసుకుని శ్మశానం స్థలానికి పూర్తిస్థాయిలో హద్దులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రహరీగోడ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, రవి, యల్లప్ప, నారాయణ, నాగముని పాల్గొన్నారు.

20వ రోజుకు సమ్మె

ఎమ్మిగనూరు టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు మరియు న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నారాయణ డిమాండ్ చేశారు..రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 20వ రోజు సమ్మె చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి సోమప్ప సర్కిల్ నుండి వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మునిసిపల్ కార్యాలయం ఎదుట కూర్చొని తమ నిరసన తెలిపారు కార్యక్రమంలో రాజేంద్ర,నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి,సాయి,విజయ్ పాల్గొన్నారు.

కలల సాకారం కోసం కష్టపడాలి

● పద్మశాలి బహుత్తమ సంఘం అధ్యక్షుడు పెద్ద రంగస్వామి


అవార్డులు అందుకున్న విద్యార్థులతో పద్మశాలి బహుత్తమ సంఘం నాయకులు


విద్యార్థి ధనుశ్


కసూరి నరేంద్రవర్మ

ఎమ్మిగనూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): కలలు కనండి ఆ కలల సాకారం కోసం శ్రమించాలని దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్లడించారని, ఆ స్ఫూర్తితో అమ్మనాన్నల కలల సాకారం దిశగా విద్యార్థులు కష్టడాలని ఎమ్మిగనూరు పద్మశాలి బహుత్తమ సంఘం అధ్యక్షుడు చుంచా పెద్ద రంగస్వామి, యువజన సంఘం అధ్యక్షుడు విశ్వనాథ్ రమేశ్ పేర్కొన్నారు. పట్టణంలో ఇంటర్మీడియట్, పదవ తరగతి తుది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పద్మశాలి విద్యార్థులకు 'ప్రతిభకు ప్రోత్సాహం' పేరిట పద్మశాలి బహుత్తమ సంఘం, యువజన సంఘం సంయుక్తంగా వెండి బహుమతులు, మెమోంటోలు అందజేశామని స్థానిక శ్రీమార్కెండేయస్వామి దేవస్థానంలో సోమవారం విలేకరులకు వివరించారు. పదవ తరగతిలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులుకు 3 తులాలు, 2 తులాలు, ఒకటిన్నర తులం వెండి పతకాలు, మెమోంటోలు అందజేశారు. ఇంటర్మీడియట్‌లో ఫస్ట్ ఇయర్‌లో ప్రథన స్థానం సాధించి విద్యార్థికి ఒకటిన్నర తులం, సెకండ్ ఇయర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థికి 2 తులాలు వెండి పతకంతో పాటు మెమోంటో, మరో 50 మంది విద్యార్థులకు ప్రోత్సాహకంగా మెమోంటోలు అందజేశారు. పేద విద్యార్థులకు పద్మాశాలి సంఘం అండగా ఉంటుందని పేర్కొన్నారు. నాయకులు పోలే ప్రసాద్, దోమ భీమేశ్, గుడిపాటి రవికుమార్, క్యాబర్శి నరేశ్‌బాబు, ఆడిమి ఉరుకుందు, మాన సత్యనారయణ, క్యాబర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

జోరుగా వానలు


తుంగభద్ర నదీతీరంలో వర్షానికి మూతపడిన దుకాణాలు


కోసిగిలో బసవన్న కొండపై కమ్ముకున్న నీలి మేఘాలు

మంత్రాలయం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలంలో తొలిసారి వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. ఈ ఏడాది ఎప్పుడూ లేని విధంగా సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా జోరుగా వర్షాలు పడ్డాయి. రాఘవేర్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ప్రధాన రహదారులోని దుకాణాలు, నదితీరంలోని దుకాణాలు మూసివేశారు. మంత్రాలయం మండలంలో అన్ని గ్రామాల్లో సోమవారం కురిసిన వర్షానికి రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నారు. ముందస్తు వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోసిగి: మండల కేంద్రమైన కోసిగితో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాన నీటితో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ముఖ్యంగా కోసిగిలోని బసవనకొండ, తిమ్మప్ప, రంగప్ప కొండలపై నీలి మబ్బులు కమ్ముకుని కోసిగి మొత్తం చుట్టేశాయి. దీంతో మేఘాలు కిందికి దిగివచ్చినట్లు కనిపించాయి. అయితే బసవన్న కొండపై నీలి మబ్బు మేఘాలు కొండ కిందకు రావడంతో ఈ దృశ్యాలు చూసిన కోసిగి ప్రజలను ఆకట్టుకుంది. ముందస్తు వర్షాలు, ఎడతెరిపి లేని వర్షాలకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే నెలలోనే ముందస్తు వర్షాలు పడటంతో రైతులు వ్యవసాయ పనుల్లో విత్తనాలు విత్తేందుకు నిమగ్నమయ్యారు.

మహానాడుకు తరలిరండి

మంత్రాలయం, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా కడప గడ్డపై మహానాడు సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమానులు వరదలా తరలిరావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే మహానాడు కోసం కార్యకర్తలకు ప్రత్యేక వాహనాలు, భోజన, వసతులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం మండలాల్లోని మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు తమ పరిధిలో ఉన్న నందమూరి అభిమానులను ప్రతి ఒక్కరిని సభకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పీఠాధిపతికి ముత్యాలతో అభిషేకం


పీఠాధిపతికి ముత్యాలతో అభిషేకం చేస్తున్న భక్తులు

మంత్రాలయం, మే 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు ముత్యాలు, పుష్పాలతో అభిషేకం చేశారు. సోమవారం ధార్మిక పర్యటనలో ఉన్న పీఠాధిపతి బెంగుళూరు రాజరాజేశ్వరి నగర్‌లోని రాఘవేంద్రస్వామి 25వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా వచ్చిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులను పంచ అశ్వ వాహనంపై ఘనంగా ఊరేగించారు. అనంతరం ముత్యాలతో అభిషేకం చేసి పుష్పాలతో వర్షం కురిపించిన అనంతరం తులాభారం వేశారు. పద్మశ్రీ అవార్డు అందుకున్న డా.ప్రహ్లాద రామారావును పీఠాధిపతి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజా ఎస్ వాహీంద్రచార్, ద్వారపాలక అనంత స్వామి, పవనాచార్, తదితరులు పాల్గొన్నారు.

29వ తేదీ వరకు భారీ వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ మీదుగా ఉపరిత ద్రోణి కారణంగా ఈనెల 29వ తేదీ వరకు రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మండలంలోని బనవాసి కృషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. రాఘవేంద్ర చౌదరి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందన్నారు. దీంతో గంటలకు 70 కి.మీ వేగంతో గాలులు వీస్తాయన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందన్నారు. గురువారం వరకు మోస్తారు వర్షాలు పడతాయన్నారు. పంటలను సాగు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

'బాధిత కుటుంబానికి పార్టీ అండ'


ఆర్థిక సాయం అందజేస్తున్న రఘునాథ్ రెడ్డి

మంత్రాలయం, మే 26 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని టీడీపీ నాయకులు అన్నారు. మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రాఘన్న సోదరుడు రవి (40) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి సోదరుడు టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి రవి మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. మట్టి ఖర్చులకు పదివేల రూపాయల నగదును అందజేశారు. రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎటువంటి ఆపద, కష్టం వచ్చినా మాధవరం రామిరెడ్డి కుటుంబం అండగా ఉంటుందన్నారు. నాయకులు మహేష్ నాయుడు, రవి, తలారి రాఘన్న, శ్రీను, మల్లా, వీరేష్, ఉరుకుందు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా దారులు


బురదమయంగా మారిన రోడ్లు

పెద్దకడుబూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుకుంట గ్రామంలో దారులు బురద మయంగా మారాయి. నాలుగు రోజులుగ కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని వీధులు వర్షపు నీటితో నిండిపోయి. వీధులన్ని బురద మయంగా మారాయి. మండలంలోని కల్లుకుంట, దొడ్డిమేకల, కంబళదిన్నె, జాలవాడి, రాగిమాన్‌దొడ్డి గ్రామాల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో దారులు బురద మయంగా మారాయి. అధికారులు స్పందించ్లి సీసీ రోడ్లు వెయ్యాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు జలమయం

● గోనెగండ్లలో అధ్వానంగా రహదారులు
● ఇబ్బందుల్లో వాహనదారులు


గోనెగండ్ల-పిల్లిగుండ్ల రహదారిలో గుంతల్లో వర్షపు నీరు


హెచ్.కైరవాడి-పెద్దనేలటూరు రోడ్డులో నిలిచిన నీరు

గోనెగండ్ల, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు రోడ్డు జలమయమైంది. సీసీరోడ్డు, డ్రైనేజి లేని కారణంగా మురుగునీరు వర్షపునీరు రోడ్డు లోనే నిలిచి పోతుంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇదే రహదారి వెంట బస్సులు, ట్రాక్టర్‌లు, లారీలు జీపులు వెలుతుంటాయి. అయితే ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహన దారులు నీటిగుంతలలో పడి గాయాల పాలైన సంఘటనలు ఉన్నాయి. వర్షంలే మూడు రోజులు అయినప్పటికి రహదారిలో ని నీరు తగ్గడంలేదు. చిన్నపాటి వర్షాలకు రోడ్డులో వర్షపు నీరు నిలుస్తుండటంతో వృద్ధులు, పిల్లలు, మహిళ ల రాక పోకలకు అంతరాయం కలుగుతుందిని గ్రామస్థులు తెలుపుతున్నారు. అధికారులు సీసీ రోడ్డు, డ్రైనేజి వేయక పోవడం కారణంగా ఈ పరస్థితి ఏర్పడిందని వారు తెలుపుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పిల్లిగుండ్ల రహదారి అధ్వానం

● మండలంలో పిల్లిగుండ్ల, నెరుడుప్పల, ఒంటెడుదిన్నె, ఎర్రబాడు గ్రామాలకు వెళ్లే దారి గుంతలమయంగా మారిపోయింది. దీంతో వర్షపునీరు గుంతలలో చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గత కొన్ని నెలలుగా రహదారి గుంతలు పడి రాళ్లు తేలి అధ్వాన్నంగా మారి పోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. రహదారిని బాగుచేయాలని పలు మార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికి ఫలితం లేకుండా పోయిందన్నారు. విద్యార్థులు చదువుకునేందుకు గోనెగండ్లకు రావాల్సి ఉండటంతో సైకిళ్లు, ద్విచక్రవాహనలు ఆటోలలో వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.